ANN తెలుగు

Follow: @ANNTELUGU

14-04-2026

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ సంపుటి- 23 సంచిక- 107 పేజీలు-08 వెల-రూ.6

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316 WWW.EPAPER.MAHAADAILY.COM



## నిధుల కోసం మంత్రుల కాళ్ళు మొక్కాలా?

### భగ్గుమన్న పోచారం

### సిద్దాపూర్ రిజర్వాయర్ వద్ద బైఠాయింపు

నిజామాబాద్, మహా : నిజామాబాద్ జిల్లా వర్ని మండలం సిద్దాపూర్ రిజర్వాయర్ వద్ద ప్రభుత్వ సలహాదారుడు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి బైఠాయించారు. ఈ సందర్భంగా ఆయన సీఎంతోపాటు మంత్రుల మీద ఘాటు వ్యాఖ్యలు చేశారు. బిల్లుల కోసం మంత్రులకు ఫోన్ చేసినా స్పందన లేదని, సీఎంకు సైతం 20 సార్లు ఫోన్ చేశానని మండిపడ్డారు. బిల్లులు రాక అభివృద్ధి పనులు ఆగిపోతున్నాయని ఆరోపిస్తూ.. సీనియర్ ఎమ్మెల్యే ఫోన్ కూడా లిఫ్ట్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిధుల కోసం మంత్రుల కాళ్ళు మొక్కలా అంటూ వ్యాఖ్యానించారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి పరిస్థితులు చూడలేదని పోచారం ఆవేదన చెందారు. బిల్లులు రాక కాంట్రాక్టర్లు పారిపోతున్నారన్నారు.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

## రాజ్యాంగంపై 'కుట్ర' దాడి

- మహిళా రిజర్వేషన్లు కేవలం 'నెపం'
- దక్షిణాది అస్తిత్వాన్ని తుడిచిపెట్టే ప్లాన్
- కేంద్రంపై సోనియా గాంధీ సంచలన వ్యాఖ్యలు

02



## త్రిష ఇంటికి బాంబు బెదిరింపు

- చెన్నైలో హై అలర్ట్

02



## కేసీఆర్‌పై సీతక్క ఫైర్

- అంగన్‌వాడీ ఫోన్ల అంశంపై లీగల్ వార్
- ప్రతిష్ఠ దెబ్బతీస్తే ఊరుకోం
- క్షమాపణ చెప్పకుంటే క్రిమినల్ చర్యలు తప్పవు

02





# పునర్విభజనపై హైబ్రిడ్ మోడల్ కావాలి

- జనాభాతో పాటు జీఎస్‌డీపీని ప్రాతిపదికగా తీసుకోవాలి..
- దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరిగితే సహించం
- మహిళా రిజర్వేషన్లకు మా సంపూర్ణ మద్దతు..
- కానీ దాన్ని పునర్విభజనతో ముడిపెట్టడం సరికాదు..
- సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్

**హైదరాబాద్, మహా:** దేశంలో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల సంఖ్య పెంపు మరియు పునర్విభజన ప్రక్రియపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గళమెత్తారు. నియోజకవర్గాల పెంపు అనేది కేవలం జనాభా ప్రాతిపదికన మాత్రమే కాకుండా, రాష్ట్రాల ఆర్థిక భాగస్వామ్యాన్ని ప్రతిబింబించేలా 'జీఎస్‌డీపీ ఆధారిత హైబ్రీడ్ మోడల్'లో జరగాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, ప్రభుత్వ సలహాదారు కేవీ కేశవరావు , ఎంపీలతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి ఈ కీలక ప్రతిపాదనలను వివరించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని తాము మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని, అయితే మహిళా రిజర్వేషన్లను నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టి తెరపైకి తీసుకురావడం దేశ రాజకీయ సమగ్రతకు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల మనుగడకు అత్యంత ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుతం ప్రతిపాదించిన విధానం ప్రకారం నియోజకవర్గాలను పెంచితే ఉత్తర మరియు దక్షిణాది రాష్ట్రాల మధ్య రాజకీయ అంతరం భారీగా పెరిగిపోతుందని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతమున్న 543 లోక్‌సభ స్థానాలకు అదనంగా మరో 50 శాతం సీట్లను పెంచాలని కేంద్రం భావిస్తోందని, అంటే అదనంగా వచ్చే 272 స్థానాల్లో శాస్త్రీయత ఉండాలని ఆయన సూచించారు. ఇందులో 136 సీట్లను ప్రొరేటా (జనాభా దామాషా) ప్రకారం కేటాయించి, మిగిలిన 136 సీట్లను ఆయా రాష్ట్రాలు జాతీయ స్థూల ఉత్పత్తికి (GSDP) అందిస్తున్న వాటా ప్రాతిపదికన విభజించాలని రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు.

మిగతా 2లో

## సీఎం రేవంత్ రెడ్డి కొత్త ఫార్ములా

### .. ఏపీకి 38, తెలంగాణకు 30 ఎంపీ సీట్లు



**హైదరాబాద్, మహా:** దేశంలో జరగబోయే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక సరికొత్త ప్రతిపాదనను ముందుకు తెచ్చారు. జనాభాను కాకుండా, రాష్ట్రాల ఆర్థిక పనితీరును సూచించే స్థూల జాతీయోత్పత్తి (జీఎస్డీపీ) ఆధారంగా ఎంపీ సీట్లను కేటాయించాలని ఆయన సూచించారు. ఈ విధానంలో ఆంధ్రప్రదేశ్‌కు 38, తెలంగాణకు 30 లోక్‌సభ స్థానాలు దక్కుతాయని చెప్పారు. జనాభా నియంత్రణ పాటిస్తూ, ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్న దక్షిణాది రాష్ట్రాలు, కేవలం జనాభా ప్రాతిపదికన పునర్విభజన జరిగితే రాజకీయంగా నష్టపోతాయనే ఆందోళన చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో, పనితీరు ఆధారిత కేటాయింపులు ఉండాలనేది సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనలోని ముఖ్య ఉద్దేశం. దీనివల్ల ఉత్తరాది రాష్ట్రాలతో పోలిస్తే దక్షిణాది రాష్ట్రాల ప్రాధాన్యం తగ్గకుండా ఉంటుందని ఆయన వర్గం భావిస్తోంది. ఈ కొత్త ఫార్ములా ప్రకారం, తెలంగాణకు ప్రస్తుతమున్న 17 సీట్లకు అదనంగా 13 చేరి మొత్తం 30కి పెరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌కు కూడా 13 సీట్లు అదనంగా వచ్చి 38కి చేరుకుంటాయి. దక్షిణాదిలోని ఇతర రాష్ట్రాలైన తమిళనాడుకు 62, కర్ణాటకకు 49 సీట్లు దక్కనున్నాయి. దేశంలోనే అత్యధికంగా మహారాష్ట్రకు 35 సీట్లు పెరిగి మొత్తం 83కి, జనాభా అధికంగా ఉండే ఉత్తరప్రదేశ్‌కు 29 సీట్లు పెరిగి 109కి చేరుకుంటాయి. మొత్తం మీద, ఈ ప్రతిపాదన అమలైతే కేంద్ర రాజకీయాల్లో ఆర్థికంగా బలమైన రాష్ట్రాల పాత్ర కీలకం కానుంది. జనాభా పెరుగుదలను ప్రోత్సహించే బదులు, ఆర్థిక అభివృద్ధిని ప్రోత్సహించేలా రాష్ట్రాలను ముందుకు నడిపించడమే ఈ 'జీఎస్డీపీ ఫార్ములా' లక్ష్యంగా కనిపిస్తోంది.

## చర్లపల్లి ఆత్మహత్యల మిస్టరీలో బిగ్ ట్విస్ట్

### అత్తింటిపై భర్త సురేందర్ రెడ్డి రివర్స్ అటాక్!



- **నా పెళ్లాం, పిల్లలు పిరికివాళ్లు కాదు.. వాళ్లే బలితీసుకున్నారు**
- **పోలీసులను ఆశ్రయించిన భర్త!**
- **నేను చనిపోయినా నా ఆస్తి వారికి దక్కొద్దు**

**హైదరాబాద్, మహా:** మూడు నెలల క్రితం చర్లపల్లిలో రైలు కిందపడి ఇద్దరు చిన్నారులతో సహా సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని విజయారెడ్డి ఆత్మహత్య చేసుకున్న ఘటన రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. ఇప్పటివరకు ఆ మరణాలను 'ఒంటరితనం, మానసిక ఒత్తిడి' ఖాతాలో వేసి మమ అనిపించిన పోలీసులకు, విజయారెడ్డి భర్త సురేందర్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు ఇప్పుడు మైండ్ బ్లాక్ చేస్తోంది. దుబాయ్ నుంచి వచ్చిన తర్వాత 'అన్యోన్యంగా ఉన్నాం' అని చెప్పిన సురేందర్ రెడ్డి, ఇప్పుడు ఒక్కసారిగా తన అత్తింటిపైనే యుద్ధం ప్రకటించడం ఈ కేసును మలుపు తిప్పింది. తన భార్యాపిల్లలు ఆత్మహత్య చేసుకునేంత పిరికివాళ్లు కాదని, తన అత్త పుష్పలత, బావమరిది చిరంజీవి చేసిన వేధింపులే వారి మరణానికి కారణమని ఆయన చేసిన ఆరోపణలు ఇప్పుడు పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

**ఆస్తి కాంక్షే 'ఆహుతి' తీసుకుందా?**

సురేందర్ రెడ్డి ఫిర్యాదు ప్రకారం.. విజయారెడ్డి మరణం వెనుక అసలు కారణం ఆస్తి గొడవలే.

మిగతా 2లో

## మల్టీలెవల్ మార్కెటింగ్ ముసుగులో భారీ దోపిడీ

### 'యూనిక్' పేరుతో వందల కోట్లకు శఠగోపం

### ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే రూ.800 కోట్ల మేర మోసం

### బాధితుల హాహాకారాలు



**కరీంనగర్,మహా:** తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు గడించవచ్చనే మాయమాటలను నమ్మి పెట్టుబడులు పెట్టిన వేలాది మంది అమాయక ప్రజల ఆశలను ఆసరాగా చేసుకుని మరో మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థ బోర్డు తిప్పేసింది. 'యూనిక్ మర్కంటైల్ ఇండియా లిమిటెడ్' పేరుతో రంగంలోకి దిగిన ఈ సంస్థ, పేద మరియు మధ్యతరగతి వర్గాలను లక్ష్యంగా చేసుకుని నిలువునా ముంచేసింది.

మిగతా 2లో

## ఉప్పల్ గడ్డపై సన్ రైజర్స్ విక్టరీ

### ఆరెంజ్ ఆర్మీ విధ్వంసం.. రాజస్థాన్ రాయల్స్ చిత్తు



**హైదరాబాద్, మహా :** భాగ్యనగరంలోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం సాక్షిగా సోమవారం రాత్రి పరుగుల వేట కాదు.. పరుగుల విధ్వంసం సాగింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా జరిగిన అత్యంత ఉత్కంఠభరితమైన పోరులో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. గత కొన్ని మ్యాచ్‌లుగా ఎదురుదెబ్బలతో సతమతమవుతున్న ఆరెంజ్ ఆర్మీ, సొంత గడ్డపై అభిమానుల కేరింతల మధ్య సింహంలా గర్జించింది. రాజస్థాన్ రాయల్స్ గర్వాన్ని అణచివేస్తూ 57 పరుగుల భారీ తేడాతో చారిత్రాత్మక విజయాన్ని అందుకుంది. టాస్ గెలిచిన రాజస్థాన్ రాయల్స్ జట్టు హైదరాబాద్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించడం ఆ జట్టు చేసిన అతిపెద్ద తప్పిదమని తేలిపోయింది. నిర్ణీత 20 ఓవర్లలో సన్‌రైజర్స్ హైదరాబాద్ 6 వికెట్ల నష్టానికి 216 పరుగుల భారీ లక్ష్యాన్ని ప్రత్యర్థి ముందు ఉంచింది.

మిగతా 2లో

## సింగర్ మంగ్లీ వివాదంలో మరో ట్విస్ట్

### ఇరువర్గాలూ ఆధారాలు ఇవ్వలేదంటున్న పోలీసులు

### మైక్రోఫైనాన్స్ పేరుతో కోట్ల వసూలు అంశం



**హైదరాబాద్, మహా ;** ప్రముఖ గాయని మంగ్లీ వివాదం రోజుకో మలుపు తిరుగుతోంది. ఈ కేసుకు సంబంధించి బాధితుల తరఫున పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు వచ్చిన న్యాయవాది సుబ్బారావుకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. బాధితులతో కలిసి వచ్చిన న్యాయవాది సుబ్బారావు మద్యం సేవించి ఉన్నారనే అనుమానంతో పోలీసులు ఆయనకు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. పరీక్షలో 27 పాయింట్లు నమోదయ్యాయి. మంగ్లీ, న్యాయవాది సుబ్బారావు మధ్య జరిగిన గొడవకు సంబంధించి, ఇరువర్గాలు ఒకరినొకరు బెదిరించుకున్నారనే ఫిర్యాదుపై మాత్రమే పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులు అందినప్పటికీ, దానికి సంబంధించిన పక్కా ఆధారాలను ఇరువర్గాలు ఇప్పటి వరకు పోలీసులకు సమర్పించలేదు. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ కొనసాగుతోందని సీఐ రామకృష్ణ తెలిపారు. మైక్రో ఫైనాన్స్ పథకాలలో పెట్టుబడులు పెట్టిస్తామని నమ్మించి రమావత్ మధుపాల్ అలియాస్ భరత్ చౌహాన్, శివ (మంగ్లీ సోదరుడు), శైలజా చౌహాన్ , మంగ్లీ కలిసి దాదాపు రూ.9.5 నుంచి రూ.10 కోట్ల వరకు సేకరించినట్లు న్యాయవాది సుబ్బారావు ఆరోపించారు. ఈ నిధులను గోకులానందన ఇన్‌ఫ్రా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పేరిట

మిగతా 2లో

## సైబర్ సొమ్ము రికవరీ కష్టమే

- తెలంగాణలో కేవలం 12 శాతమే రికవరీ
- నిత్యం కొత్త తరహా మోసం చేస్తున్న ముఠాలు
- ఐదేళ్లలో వేల కోట్ల దోపిడీ
- విదేశీ స్థావరాల నుంచి ఆపరేషన్లు
- మ్యూల్ ఖాతాల ద్వారా క్రిప్టో కరెన్సీలోకి మళ్లింపు



**హైదరాబాద్, మహా :** ఆధునిక యుగంలో సాంకేతికత ఎంతగా విస్తరిస్తోందో, అదే స్థాయిలో సైబర్ నేరగాళ్లు అమాయక ప్రజల కష్టార్జితాన్ని కొల్లగొడుతూ కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. దేశంలో నిత్యం ఎవరో ఒకరు సైబర్ ఉచ్చులో చిక్కుకుంటూనే ఉన్నారని, అయితే ఇలా ఆర్థికంగా నష్టపోతున్న

మిగతా 2లో

# రాజ్యాంగంపై 'కుట్ర' దాడి

**ఢిల్లీ,మహా:** దేశ రాజకీయాల్లో నియోజకవర్గాల పునర్విభజన అంశం ఇప్పుడు ఒక మహా సంగ్రామానికి దారితీస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దక్షిణాది గొంతుకగా నిలవగా, ఇప్పుడు కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ నేరుగా రంగంలోకి దిగి మోదీ సర్కార్‌పై అస్త్రశస్త్రాలను సంధించారు. కేంద్రం తలపెట్టిన సీమాంకన ప్రక్రియ కేవలం జనాభా లెక్కల సర్దుబాటు కాదని, ఇది సాక్షాత్తూ 'రాజ్యాంగంపై జరుగుతున్న దాడి' అని ఆమె సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఒక ప్రముఖ ఆంగ్ల పత్రికలో రాసిన విశ్లేషణాత్మక కథనంలో, కేంద్ర ప్రభుత్వం అత్యంత గోప్యంగా అమలు చేస్తున్న ఈ 'ఖతర్నాక్' ప్లాన్ వెనుక ఉన్న అసలు రంగును ఆమె బట్టబయలు చేశారు. ఈ నెల 16 నుంచి జరగబోయే పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల వెనుక ఉన్న అసలు ఉద్దేశం మహిళా రిజర్వేషన్లు కాదని, సీమాంకనం పేరిట దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే కుట్ర అని ఆమె ఆరోపించారు.

**మహిళా రిజర్వేషన్లు ఒక 'కవచం' మాత్రమే!**

మహిళా రిజర్వేషన్ల బిల్లుపై కేంద్రం చూపుతున్న ఉత్సాహం కేవలం ఒక 'ఐ వాష్' (కంటితుడుపు) మాత్రమేనని సోనియా విశ్లేషించారు. అసలు రిజర్వేషన్ల అమలును 2029 వరకు సాగదీయడం వెనుక ఉన్న మర్మమేమిటని ఆమె ప్రశ్నించారు. కేవలం మూడు రోజుల ప్రత్యేక సమావేశాల్లో మహిళా బిల్లును అడ్డం పెట్టుకుని, సీమాంకన ప్రక్రియకు రాజ్యాంగ హోదా కల్పించేందుకు కేంద్రం 'బుల్డోజర్' తరహాలో ముందుకు వెళ్తోందని మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్య విలువలకే గొడ్డలి పెట్టు అని, అప్రజాస్వామిక పద్ధతుల్లో దేశ భవిష్యత్తును తాకట్టు పెడుతున్నారని ఆమె ధ్వజమెత్తారు. కుల గణన అంశాన్ని పక్కదారి పట్టించేందుకే బీజేపీ ఈ కొత్త నాటకానికి తెరలేపిందని సోనియా విమర్శించారు.

**దక్షిణాదికి జరిగే అన్యాయంపై ఆందోళన**

సీమాంకనం జరిగితే దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం ఘోరంగా పడిపోతుందన్న ఆందోళనను సోనియా గాంధీ గట్టిగా వినిపించారు. కుటుంబ నియంత్రణను విజయవంతంగా అమలు చేసి, అక్షరాస్యతలో ముందున్న దక్షిణాది రాష్ట్రాలకు ఇది శిక్షగా మారబోతోందని ఆమె హెచ్చరించారు. కేవలం అంకెలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకూడదని, రాజకీయ సమానత్వం దెబ్బతినకుండా చూడాలని డిమాండ్ చేశారు. జనాభాను నియంత్రించని రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు కట్టబెట్టి, ప్రగతి పథంలో ఉన్న రాష్ట్రాలను రాజకీయంగా అప్రస్తుతం చేయడం రాజ్యాంగ స్ఫూర్తికే విరుద్ధమని ఆమె స్పష్టం చేశారు.

**ఎన్నికల కోసమే 'నరేటివ్ మేనేజ్‌మెంట్'!**

త్వరలో జరగనున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు వంటి రాష్ట్రాల ఎన్నికలను దృష్టిలో ఉంచుకునే ప్రధాని మోదీ ఈ విన్యాసాలు చేస్తున్నారని సోనియా ఆరోపించారు. దేశంలో నెలకొన్న అసలైన ఆర్థిక సమస్యలు, నిరుద్యోగం నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఈ 'నరేటివ్ మేనేజ్‌మెంట్' (వార్తా విన్యాసం) చేస్తున్నారని మండిపడ్డారు. విపక్షాలను రక్షణ స్థితిలోకి నెట్టేందుకు రాజ్యాంగంతో చెలగాటమాడుతున్నారని, దీనిని దేశం హర్షించదని ఆమె తేల్చి చెప్పారు.

# పునర్విభజనపై హైబ్రిడ్ మోడల్ కావాలి

(మొదటిపేజీ తరువాయి)

దేశాభివృద్ధికి ఆర్థిక వనరులను సమకూర్చుతూ, అత్యధిక భాగస్వామ్యం కలిగి ఉన్న రాష్ట్రాలకు ఈ హైబ్రిడ్ మోడల్ ద్వారా తగిన ప్రాధాన్యత లభిస్తుందని ఆయన విశ్లేషించారు. కేవలం జనాభాను నియంత్రించినందుకు దక్షిణాది రాష్ట్రాలను రాజకీయంగా శిక్షించడం సరికాదని, ఇది సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధమని స్పష్టం చేశారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లుతో పాటు నియోజకవర్గాల పెంపు బిల్లును కూడా హడావిడిగా ఆమోదించే ప్రయత్నం జరుగుతోందని, ఈ రెండింటినీ ఒకటిగా చిత్రీకరించడం వెనుక రాజకీయ కుట్ర దాగి ఉందని ముఖ్యమంత్రి మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్లు మరియు నియోజకవర్గాల పునర్విభజన అనేవి పూర్తిగా భిన్నమైన అంశాలని, ఒకదానితో మరొకదానికి సంబంధం లేదని ఆయన తేల్చి చెప్పారు. 2023లోనే మహిళా రిజర్వేషన్ల బిల్లు వచ్చినప్పుడు తాము మద్దతు ఇచ్చామని, 2026 జనాభా లెక్కల తర్వాతే అమలు చేస్తామన్న అడ్డంకిని అప్పుడే తొలగించి ఉంటే ఈపాటికి దేశవ్యాప్తంగా వందలాది మంది మహిళలు చట్టసభలకు ఎన్నికై ఉండేవారని గుర్తు చేశారు. ఇప్పుడు కూడా మహిళా రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలని, కానీ నియోజకవర్గాల పెంపు విషయంలో మాత్రం అన్ని పక్షాలతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేంద్రం తాజా ప్రతిపాదనల వల్ల దక్షిణాది రాష్ట్రాలు ఎంతలా నష్టపోతాయో రేవంత్ రెడ్డి గణాంకాలతో సహా వివరించారు. ఉదాహరణకు కేరళలో ప్రస్తుతం ఉన్న 20 స్థానాలను 50 శాతం పెంచితే అవి 30కి చేరుతాయని, అదే సమయంలో ఉత్తరప్రదేశ్‌లోని 80 స్థానాలు 120కి పెరుగుతాయని, దీనివల్ల రెండు రాష్ట్రాల మధ్య వ్యత్యాసం 90 స్థానాలకు చేరుతుందని పేర్కొన్నారు. తెలంగాణ విషయానికి వస్తే, ఉత్తరప్రదేశ్‌తో పోలిస్తే ఇప్పుడున్న వ్యత్యాసం కంటే అదనంగా మరో 94 సీట్ల అంతరం పెరుగుతుందని వివరించారు. ఉత్తరాది రాష్ట్రాల్లోని 413 సీట్లు 621కి పెరగడం వల్ల దక్షిణాది రాజకీయంగా అట్టడుగున పడిపోతుందని, చిన్న రాష్ట్రాలు కేవలం ద్వితీయ శ్రేణి రాష్ట్రాలుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. దక్షిణాది రాష్ట్రాలు దేశానికి ఆర్థిక రాజధానులుగా ఉంటూ ఆదాయాన్ని, ఉద్యోగాలను కల్పిస్తుంటే, ఉత్తరాది రాష్ట్రాలు కేవలం రాజకీయ రాజధానులుగా మారి అధికారాన్ని చెలాయించడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదని హితవు పలికారు. ఈ సున్నితమైన అంశంపై కేంద్ర ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయాలు తీసుకోకుండా ముందుగా విధివిధానాలు ఖరారు చేయాలని, అఖిలపక్ష సమావేశం నిర్వహించి అన్ని రాష్ట్రాల శాసనసభల అభిప్రాయాలను సేకరించాలని ముఖ్యమంత్రి సూచించారు. నియోజకవర్గాల పెంపుపై ఒక నిపుణుల కమిటీని నియమించి, ఆ కమిటీ నివేదికపై పార్లమెంటులో సుదీర్ఘంగా చర్చించిన తర్వాతే తుది నిర్ణయం తీసుకోవాలన్నారు. ఈశాన్య రాష్ట్రాలు మరియు కేంద్రపాలిత ప్రాంతాల్లో సీట్ల కేటాయింపు కేవలం జనాభా ప్రాతిపదికన జరగలేదని, అక్కడ ప్రాతినిధ్యానికి విలువ ఇచ్చారని గుర్తు చేస్తూ, దక్షిణాది విషయంలో కూడా అదే రీతిన ఆలోచించాలని కోరారు. ఈ గందరగోళానికి తెరదించేందుకు దక్షిణాది రాష్ట్రాల ముఖ్యమంత్రులతో పాటు ఢిల్లీ, పంజాబ్ వంటి రాష్ట్రాల ముఖ్యమంత్రులకు కూడా లేఖలు రాస్తానని రేవంత్ రెడ్డి ప్రకటించారు. దేశ భవిష్యత్తు ముడిపడి ఉన్న ఇలాంటి నిర్ణయాల్లో తొందరపాటు పనికిరాదని, 2028 నాటికి జనాభా లెక్కల ప్రక్రియ పూర్తవుతుంది కాబట్టి, ఆలోగా ఏకాభిప్రాయం సాధించాలని ముఖ్యమంత్రి హితబోధ చేశారు.

# త్రిష ఇంటికి బాంబు బెదిరింపు

**.. చెన్నైలో హై అలర్ట్**

**మహా:** ప్రముఖ నటి త్రిష నివాసానికి మరోసారి బాంబు బెదిరింపు రావడం చెన్నైలో కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వచ్చిన ఈ బెదిరింపుతో పోలీసులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. వివరాల్లోకి వెళితే.. చెన్నైలోని త్రిష నివాసంలో బాంబు అమర్చినట్లు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఉదయం 9:30 గంటల సమయంలో ఒక ఈమెయిల్ వచ్చింది. దీంతో వెంటనే అప్రమత్తమైన పోలీసులు త్రిష ఉంటున్న తేనాంపేటలోని ఆమె ఇంటికి చేరుకున్నారు. బాంబు స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో పోలీసులు త్రిష ఇంటి పరిసర ప్రాంతాల్లో గంటల తరబడి సోదాలు నిర్వహించారు. ఇంట్లోని ప్రతి మూలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. సుదీర్ఘ తనిఖీల అనంతరం, అక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలు లభించకపోవడంతో పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఆ బెదిరింపు కేవలం ఒక "ఫేక్ కాల్" అని అధికారులు ధృవీకరించారు.

# కేసీఆర్‌పై సీతక్క ఫైర్

**హైదరాబాద్, మహా:** రాష్ట్ర రాజకీయాల్లో అధికార, ప్రతిపక్షాల మధ్య మాటల యుద్ధం ఇప్పుడు న్యాయ పోరాటంగా రూపుదాల్చింది. అంగన్‌వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు వ్యవహారంలో గత కొన్ని రోజులుగా సోషల్ మీడియా వేదికగా సాగుతున్న ఆరోపణలపై రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క తీవ్రంగా స్పందించారు. తన ప్రతిష్టకు భంగం కలిగించేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారంటూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావుకు ఆమె లీగల్ నోటీసులు పంపారు. మంత్రి సీతక్క తరపు న్యాయవాది నాగులూరి కృష్ణకుమార్ రిజిస్టర్ పోస్ట్ ద్వారా ఈ నోటీసులను కేసీఆర్‌కు పంపడం రాజకీయ వర్గాల్లో పెను సంచలనంగా మారింది. రాజకీయ విమర్శలు హద్దులు దాటి వ్యక్తిగత దూషణలకు, అసత్య ప్రచారాలకు దారితీస్తున్న తరుణంలో సీతక్క తీసుకున్న ఈ నిర్ణయం గులాబీ దళంలో కలకలం రేపుతోంది.

**అసంబద్ధ ఆరోపణలు.. అసలు వాస్తవమిదీ!**

మంత్రి పంపిన నోటీసులో ప్రధానంగా అంగన్‌వాడీ మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియపై జరుగుతున్న ప్రచారాన్ని ఎండగట్టారు. అసలు మొబైల్ ఫోన్ల కొనుగోలు ప్రక్రియ మొత్తం తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ లిమిటెడ్ ద్వారా అత్యంత పారదర్శకంగా జరిగిందని ఆమె స్పష్టం చేశారు. టెండర్ ఇవాల్యుయేషన్ కమిటీ నిర్ణయాల ప్రకారమే కాంట్రాక్ట్ దక్కిందని, ఇందులో వ్యక్తిగతంగా తనకు ఎలాంటి సంబంధం లేదని ఆమె నోటీసులో కుండబద్దలు కొట్టారు. మొత్తం టెండర్ విలువే కేవలం రూ. 44 కోట్లు కాగా, అందులో ఏకంగా రూ. 30 కోట్ల అవినీతి జరిగిందని బీఆర్ఎస్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడం హాస్యాస్పదమని, ఇది కేవలం రాజకీయ లబ్ధి కోసం చేస్తున్న దుష్ప్రచారమేనని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా చేస్తున్న ఇటువంటి ఆరోపణలు తన సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని, వ్యక్తిత్వాన్ని కించపరిచేలా ఉన్నాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**డెడ్‌లైన్ ఫిక్స్.. లేదంటే కోర్టుకే!**

బీఆర్ఎస్ పార్టీ అఫీషియల్ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ఈ కుట్రపూరిత ప్రచారానికి ఆ పార్టీ అధినేతగా కేసీఆరే బాధ్యత వహించాలని మంత్రి సీతక్క డిమాండ్ చేశారు. వచ్చే 48 గంటల్లోగా సోషల్ మీడియాలోని ఆ అభ్యంతరకర పోస్టులను వెంటనే తొలగించడమే కాకుండా, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని అల్టిమేటం జారీ చేశారు. నిర్ణీత సమయంలోగా స్పందించకుంటే సివిల్ మరియు క్రిమినల్ చట్టాల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై పోరాడాల్సింది పోయి, ఇటువంటి అసత్య ఆరోపణలతో బురదజల్లడం సరికాదని ఆమె హితవు పలికారు. జగిత్యాల సభకు సిద్ధమవుతున్న కేసీఆర్‌కు ఈ లీగల్ నోటీసు రూపంలో సీతక్క ముందే పెద్ద షాక్ ఇచ్చారని విశ్లేషకులు భావిస్తున్నారు.

# నిధుల కోసం మంత్రుల కాళ్ళు మొక్కాలా?

(మొదటిపేజీ తరువాయి)

ఇరవై ఏండ్లు మంత్రిగా పనిచేసిన తనకు ఎవరైనా ఫోన్ చేస్తే అర్ధరాత్రి కూడా స్పందించేవాడినని గుర్తుచేశారు. ఇప్పుడు ఉన్న మంత్రులు ఫోన్ ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రూపాయి కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు రాక వెళ్లిపోతున్న కాంట్రాక్టర్లను బతిమిలాడి పనులు చేయించుకునే పరిస్థితి నెలకొందన్నారు. నిధుల మంజూరుపై సమయం ఇవ్వండి అని ఉన్నతాధికారులు పోచారంకు సర్దిచెప్పడంతో ఆయన ఆందోళన విరమించి ఇంటిబాట పట్టారు.

**పోచారం పెద్దమనసుతో అర్థం చేసుకోవాలి- పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్**

రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని పోచారం అర్థం చేసుకోవాలని పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. 8 లక్షల కోట్ల అప్పు తమ ప్రభుత్వం నెత్తిన పెట్టి పలాయనం చిత్తగించారని చెప్పుకొచ్చారు. ప్రతి నెల రూ.7 వేల కోట్ల వాయిదాలు చెల్లిస్తున్నామని.. నిధుల విడుదల ఆలస్యం అవుతుందని తెలిపారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి పెద్ద మనసుతో రాష్ట్ర ప్రభుత్వాన్ని అర్థం చేసుకోవాలని విన్నవించారు. పోచారం శ్రీనివాస్ రెడ్డి సీనియర్ నాయకులు, అని ఆయన ప్రభుత్వ సలహాదారుగా కూడా ఉన్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి నిధుల కొరత ఉందన్న విషయం ఆయనకు తెలియనిది కాదు అని అన్నారు. అభివృద్ధిని ఆకాంక్షించే నాయకుడు పోచారం శ్రీనివాస్ రెడ్డి అని, ఈ ఇబ్బందులను ఆయన అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# ఉప్పల్ గడ్డపై సన్ రైజర్స్ విక్టరీ

**ఆరెంజ్ ఆర్మీ విధ్వంసం.. రాజస్థాన్ రాయల్స్ చిత్తు**




(మొదటిపేజీ తరువాయి)

అనంతరం ఛేదనలో రాజస్థాన్ రాయల్స్ జట్టు హైదరాబాద్ బౌలర్ల ధాటికి తట్టుకోలేక 19 ఓవర్లలో కేవలం 159 పరుగులకే కుప్పకూలిపోయింది.ఈ మ్యాచ్‌లో అసలైన ఆకర్షణ సన్‌రైజర్స్ కెప్టెన్ ఇషాన్ కిషన్ బ్యాటింగ్. క్రీజులోకి వచ్చిన క్షణం నుంచే రాజస్థాన్ బౌలర్లపై విరుచుకుపడిన కిషన్, మైదానం నలుమూలలా బౌండరీల వర్షం కురిపించాడు. ఒకవైపు వికెట్లు పడుతున్నా ఏమాత్రం బెదరకుండా కేవలం 44 బంతుల్లోనే 8 ఫోర్లు, 6 సుదీర్ఘమైన సిక్సర్లతో 91 పరుగులు సాధించి సెంచరీకి కేవలం 9 పరుగుల దూరంలో అవుటయ్యాడు. కిషన్ ఇన్నింగ్స్ ఉప్పల్ స్టేడియంను హోరెత్తించింది. అతనికి తోడుగా హెన్రిచ్ క్లాసెన్ తన మార్కు మెరుపులతో 26 బంతుల్లో 40 పరుగులు చేసి ఇన్నింగ్స్‌ను వేగవంతం చేశాడు. వీరిద్దరి మధ్య నెలకొన్న 88 పరుగుల భాగస్వామ్యం రాజస్థాన్ బౌలర్ల ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసింది. ఇన్నింగ్స్ చివరలో నితీష్ కుమార్ రెడ్డి కేవలం 13 బంతుల్లోనే 4 సిక్సర్లతో 28 పరుగులు చేసి స్కోరు బోర్డును 200 దాటించాడు. చివర్లో సలీల్ అరోరా 24 పరుగులతో నాటౌట్‌గా నిలిచి ఇన్నింగ్స్‌ను ఘనంగా ముగించాడు.

అయితే, ఈ మ్యాచ్ చరిత్రలో నిలిచిపోవడానికి ప్రధాన కారణం హైదరాబాద్ యువ బౌలర్ ప్రఫుల్ హింజే సృష్టించిన అద్భుతం. ఐపీఎల్ 19 ఏళ్ల సుదీర్ఘ చరిత్రలో ఎవరికీ సాధ్యం కాని రీతిలో, ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ముగ్గురు కీలక బ్యాటర్లను పెవిలియన్ పంపి పెను సంచలనం సృష్టించాడు. ఈ సీజన్‌లో అద్భుత ఫామ్‌లో ఉన్న వైభవ్ సూర్యవంశీని మొదటి బంతికే అవుట్ చేసి షాక్ ఇచ్చిన హింజే, ఆ తర్వాత ధృవ్ జురెల్, యశస్వి జైస్వాల్‌లను కూడా అదే ఓవర్లో మట్టికరిపించాడు. ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీసి రాజస్థాన్ రాయల్స్ వెన్నుముక విరిచిన ప్రఫుల్ హింజే, స్టేడియంను ఉర్రూతలూగించాడు. ఈ దెబ్బతో రాజస్థాన్ జట్టు పీకల్లోతు కష్టాల్లో పడిపోయింది. పవర్ ప్లే ముగిసేసరికే రాజస్థాన్ కీలక వికెట్లు కోల్పోయి ఓటమికి చేరువయ్యింది.

రాజస్థాన్ ఇన్నింగ్స్‌లో డోనోవన్ ఫెరీరా 44 బంతుల్లో 69 పరుగులతో ఒంటరి పోరాటం చేసినా, సీనియర్ ప్లేయర్ రవీంద్ర జడేజా 45 పరుగులతో అండగా నిలిచినా లాభం లేకుండా పోయింది. సన్‌రైజర్స్ బౌలర్ సాకిబ్ హుస్సేన్ తన పదునైన బంతులతో రాజస్థాన్ మిడిల్ ఆర్డర్‌ను కకావికలం చేశాడు. 4 ఓవర్లలో కేవలం 24 పరుగులు మాత్రమే ఇచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టిన సాకిబ్, ప్రత్యర్థి ఆశలపై నీళ్లు చల్లాడు. మరోవైపు ఈషన్ మలింగ తన వేగవంతమైన బంతులతో రెండు వికెట్లు తీసి సాకిబ్‌కు చక్కని సహకారం అందించాడు. ఫీల్డింగ్‌లోనూ హైదరాబాద్ ఆటగాళ్లు మెరుపులు మెరిపించి ఒక్క పరుగు కూడా వదులుకోకుండా కట్టుదిట్టంగా వ్యవహరించారు. మొత్తానికి బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా అన్ని విభాగాల్లోనూ హైదరాబాద్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి అభిమానులకు మర్చిపోలేని విజయాన్ని అందించింది.

## జట్ల స్కోరు వివరాలు

- సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) బ్యాటింగ్:
- మొత్తం స్కోరు: 216/6 (20 ఓవర్లు)
- ఇషాన్ కిషన్: 91 (44 బంతులు, 8 ఫోర్లు, 6 సిక్సర్లు) విధ్వంసకర ఇన్నింగ్స్.
- హెన్రిచ్ క్లాసెన్:* 40 (26 బంతులు, 1 ఫోర్, 3 సిక్సర్లు) మధ్య ఓవర్లలో మెరుపులు.
- నితీష్ కుమార్ రెడ్డి:* 28 (13 బంతులు, 4 సిక్సర్లు) డెత్ ఓవర్ల బ్యాటింగ్.
- సలీల్ అరోరా:* 24* (13 బంతులు, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ ప్రదర్శన.
- ట్రావిస్ హెడ్:* 18 (18 బంతులు, 3 ఫోర్లు).
- బౌలింగ్ (RR):* జోఫ్రా ఆర్చర్ (2/37), తుషార్ దేశ్‌పాండే (1/55), సందీప్ శర్మ (1/52), రియాన్ పరాగ్ (1/5).
- రాజస్థాన్ రాయల్స్ (RR) బ్యాటింగ్:*
- మొత్తం స్కోరు: 159 (19 ఓవర్లలో ఆలౌట్)
- డోనోవన్ ఫెరీరా:* 69 (44 బంతులు, 7 ఫోర్లు, 3 సిక్సర్లు) జట్టును ఆదుకునే ప్రయత్నం.
- రవీంద్ర జడేజా:* 45 (32 బంతులు, 5 ఫోర్లు) బాధ్యతాయుత పోరాటం.
- తుషార్ దేశ్‌పాండే:* 25 (11 బంతులు, 3 సిక్సర్లు) చివర్లో మెరుపులు.
- వైభవ్ సూర్యవంశీ:* 0 (1 బంతి) గోల్డెన్ డకౌట్
- యశస్వి జైస్వాల్:* 1 (5 బంతులు).
- బౌలింగ్ (SRH):* సాకిబ్ హుస్సేన్ (4/24), ప్రఫుల్ హింజే (4/34), ఈషన్ మలింగ (2/31).

**ముఖ్య విశేషాలు:**

1. *ప్రఫుల్ హింజే రికార్డు:* ఇన్నింగ్స్ మొదటి ఓవర్లోనే 3 వికెట్లు తీసిన తొలి ఐపీఎల్ బౌలర్‌గా రికార్డు.
2. *భారీ భాగస్వామ్యం:* కిషన్ , క్లాసెన్ మధ్య కేవలం 39 బంతుల్లోనే 88 పరుగుల జోడి.

# సింగర్ మంగ్లీ వివాదంలో మరో ట్విస్ట్

**ఇరువర్గాలూ ఆధారాలు ఇవ్వలేదంటున్న పోలీసులు**

**మైక్రోఫైనాన్స్ పేరుతో కోట్ల వసూలు అంశం**

(మొదటిపేజీ తరువాయి)

ఇంపోర్ట్ ఎక్స్‌పోర్ట్, ట్రేడింగ్, రియల్ ఎస్టేట్ లలో పెట్టుబడులు పెడతామని బాధితలును నమ్మించారని ఫిర్యాదు చేశారు.

**మంగ్లీ డబ్బు ఆఫర్ చేసినట్లు ఆరోపణలు**

ఈ మేరకు బాధితులు తార్నాకలోని విజయపురి కాలనీకి చెందిన న్యాయవాది సింగపోగు సుబ్బారావును సంప్రదించారు. దీనిపై సింగర్ మంగ్లీని సంప్రదించగా ఆమె అనుచితంగా మాట్లాడినట్లు ఫిర్యాదులో తెలిపారు. అంతేకాదు ఈ కేసులో ఆమెను, తన సోదరుడు శివను చేర్చవద్దని మంగ్లీ ఆ న్యాయవాదికి డబ్బు ఆఫర్ చేసినట్లు ఆరోపించారు. ఆ తర్వాత దర్శకుడు వేణు ఊడుగుల, అడ్వకేట్ పూజారి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పంజాగుట్టలో సమావేశం ఏర్పాటు చేశారు.

**న్యాయవాది సుబ్బారావుకు ప్రాణహాని**

మంగ్లీ, వేణు, పూజారి నాగేశ్వర రావు, సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి తదితరులు కేసు వేయవద్దని, మీడియా వీడియోలు తొలగించాలని ఒత్తిడి తెచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సమావేశం ముగిసే సమయంలో వేణు ఊడుగుల బెదిరించగా, మంగ్లీ అసభ్య పదజాలంతో దూషించి హత్య చేస్తామని బెదిరించినట్లు సుబ్బారావు ఆరోపించారు. అదే విధంగా రమావత్ మధు, శివ ఫోన్ చేసి బెదిరించినట్లు తెలిపారు. దీంతో తనకు ప్రాణహాని ఉందని సుబ్బారావు పోలీసులను ఆశ్రయించి కేసు నమోదు చేశారు.

**మద్యం సేవించి పోలీస్ స్టేషన్‌కు...**

ఈ కేసుకు సంబంధించి బాధితుల తరపున పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌కు న్యాయవాది సుబ్బారావు వచ్చారు. అయితే ఆయనకు, పోలీసులకు మధ్య వాగ్వాదం జరిగింది. బాధితులతో కలిసి వచ్చిన సుబ్బారావు మద్యం సేవించి ఉన్నారనే అనుమానం వచ్చింది. దీంతో పోలీసులు ఆయనకు బ్రీత్ అనలైజర్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలో 27 పాయింట్లు నమోదయ్యిందని పోలీసులు తెలిపారు. మంగ్లీ, న్యాయవాది సుబ్బారావు మధ్య జరిగిన గొడవకు సంబంధించి, ఇరువర్గాలు ఒకరినొకరు బెదిరించుకున్నారనే ఫిర్యాదుపై మాత్రమే పోలీసులు కేసు నమోదు చేశారు. ఫిర్యాదులు అందినప్పటికీ, దానికి సంబంధించిన పక్కా ఆధారాలను ఇరువర్గాలు ఇప్పటి వరకు పోలీసులకు సమర్పించలేదు. ప్రస్తుతం ఈ కేసుపై విచారణ కొనసాగుతోందని సీఐ రామకృష్ణ తెలిపారు

# సైబర్ సొమ్ము రికవరీ కష్టమే

(మొదటిపేజీ తరువాయి)

బాధితుల్లో కేవలం కొద్దిమందికి మాత్రమే ఊరట లభిస్తోందని తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టీజీసీఎస్బీ) నిరంతరం శ్రమిస్తున్నప్పటికీ, బాధితులు పోగొట్టుకున్న సొమ్ములో గరిష్ఠంగా 12 శాతం మాత్రమే తిరిగి రికవరీ చేయగలుగుతున్నారని వెల్లడైంది. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వ్యవస్థాపకుడు రాజేంద్ర పల్నాటి సమాచార హక్కు చట్టం ద్వారా సేకరించిన వివరాలు రాష్ట్రంలోని సైబర్ నేరాల తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. గత ఐదు సంవత్సరాలుగా నమోదైన కేసులు మరియు బాధితులు కోల్పోయిన నగదును విశ్లేషిస్తే, రికవరీ ప్రక్రియలో ఎదురవుతున్న సవాళ్లు ఆందోళన కలిగిస్తున్నాయి. రాష్ట్రంలో నమోదవుతున్న సైబర్ నేరాల్లో సింహభాగం రాజధాని పరిధిలోనే ఉండటం గమనార్హం. మొత్తం కేసుల్లో ఒక్క సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే సుమారు 30 శాతం కేసులు నమోదవుతుండగా, హైదరాబాద్ మరియు రాచకొండ కమిషనరేట్లను కూడా కలిపితే రాజధాని కేంద్రంగానే దాదాపు 70 శాతం సైబర్ దోపిడీ జరుగుతోందని టీజీసీఎస్బీ వివరించింది. సైబర్ నేరాల బాధితుల ఫిర్యాదులను స్వీకరించడంలో మరియు వాటిని ఎఫ్ఐఆర్‌లుగా నమోదు చేయడంలో తెలంగాణ పోలీసులు దేశంలోనే ప్రథమ స్థానంలో నిలిచినప్పటికీ, విదేశీ మూలాలు ఉన్న ముఠాలను పట్టుకోవడం మరియు సొమ్మును వెనక్కి తెప్పించడం క్లిష్టతరంగా మారుతోంది. చైనాకు చెందిన సైబర్ ముఠాలు మయన్మార్, కంబోడియా, లావోస్ వంటి దేశాల్లో తమ స్థావరాలను ఏర్పాటు చేసుకుని, సామాజిక మాధ్యమాల ద్వారా భారతీయ ప్రజలను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. వాట్సప్ కాల్స్ ద్వారా బాధితులను ప్రలోభపెట్టడమే కాకుండా, కమీషన్ ఆశ చూపి స్థానికంగా ఉన్న కొందరి బ్యాంకు ఖాతాలను 'మ్యూల్ ఖాతాలు'గా వాడుకుంటూ నగదును సులువుగా తరలిస్తున్నాయి.నేరగాళ్లు దోచుకున్న నగదును తరలించే విధానం అత్యంత పక్కాగా సాగుతోంది. బాధితుల నుంచి కాజేసిన సొమ్మును ముందుగా మ్యూల్ ఖాతాల్లోకి మళ్లించి, అక్కడి నుంచి వివిధ ఖాతాలకు బదిలీ చేస్తూ ఏటీఎంలు లేదా బ్యాంకుల ద్వారా విత్ డ్రా చేస్తున్నారు. చివరగా ఈ మొత్తాన్ని క్రిప్టోకరెన్సీలోకి మార్చి విదేశాలకు తరలిస్తుండటంతో, ఇతర దేశాలకు చేరిన ఆ సొమ్మును తిరిగి తెప్పించడం దర్యాప్తు సంస్థలకు అసాధ్యంగా మారుతోంది. ఈ తరహా మోసాల్లో ఉన్నత విద్యావంతులు సైతం బలైపోతుండటం విచారకరం. హైదరాబాద్‌లో ఒక వ్యక్తి ఏకంగా రూ. 16 కోట్లు పోగొట్టుకున్నారంటే ఈ దోపిడీ ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు 2024లో రూ. 22,845 కోట్లు, 2025లో రూ. 22,495 కోట్లు కొల్లగొట్టడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.ఈ సైబర్ మాయాజాలం నుంచి రక్షించుకోవడానికి ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు. గుర్తుతెలియని నంబర్ల నుంచి సెల్ ఫోన్లకు వచ్చే మెసేజ్ లింకులను పొరపాటున కూడా ఓపెన్ చేయకూడదని, సామాజిక మాధ్యమాల్లో అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దని హెచ్చరిస్తున్నారు. యాప్‌ల ఇన్‌స్టలేషన్ కోసం కేవలం అధికారిక ప్లేస్టోర్ లేదా యాప్ స్టోర్లను మాత్రమే వాడాలని, వెబ్ లింకుల ద్వారా యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం ప్రమాదకరమని స్పష్టం చేస్తున్నారు. తక్కువ వడ్డీకి రుణాలు ఇస్తామన్నా లేదా ఆకర్షణీయమైన ఉద్యోగాలు ఇస్తామన్నా ముందుగా నగదు చెల్లించవద్దని, ఆన్‌లైన్‌లో ఎవరికీ డబ్బులు పంపవద్దని కోరుతున్నారు. ముఖ్యంగా నేటి కాలంలో 'డిజిటల్ అరెస్టు' పేరుతో జరుగుతున్న మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని, అసలు డిజిటల్ అరెస్టు అనే పదమే చట్టంలో లేదని గమనించాలని సూచించారు.\ఒకవేళ సైబర్ మోసానికి గురైనట్లు గుర్తిస్తే ఏమాత్రం ఆలస్యం చేయకుండా జాతీయ హెల్ప్‌లైన్ నంబరు 1930కి కాల్ చేయాలి లేదా ప్రభుత్వ అధికారిక వెబ్ సైట్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయాలి. ఫిర్యాదు చేసిన వెంటనే సంబంధిత బ్యాంకు శాఖకు సమాచారం అందించి, అత్యవసరంగా అన్ని రకాల ట్రాన్సాక్షన్లను నిలిపివేయాలని కోరడం ద్వారా కొంతమేర నష్టాన్ని తగ్గించుకోవచ్చని టీజీసీఎస్బీ తెలిపింది. సైబర్ భద్రతకు సంబంధించి పోలీసులు మరియు ప్రభుత్వం అందిస్తున్న తాజా అప్‌డేట్లను ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ద్వారా మాత్రమే ఈ ఆధునిక దోపిడీ నుంచి మనల్ని మనం కాపాడుకోగలమని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

# మల్టీలెవల్ మార్కెటింగ్ ముసుగులో భారీ దోపిడీ

(మొదటిపేజీ తరువాయి)

'యూనిక్ ఎస్ఎంసీఎస్' పేరిట ఆకర్షణీయమైన పథకాలను ప్రవేశపెట్టి, ప్రీమియంలు మరియు డిపాజిట్ల రూపంలో కోట్లాది రూపాయలను వసూలు చేసిన నిర్వాహకులు, ఇప్పుడు కార్యాలయాలకు తాళం వేసి పరారు కావడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ సంస్థ కార్యకలాపాలు రాష్ట్రవ్యాప్తంగా ఉన్నప్పటికీ, ఒక్క ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే దాదాపు రూ.800 కోట్ల మేర కుంభకోణం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు వెలువడటం సంచలనం సృష్టిస్తోంది .ఈ సంస్థ ప్రతినిధులు క్షేత్రస్థాయిలో ఏజెంట్లను నియమించుకుని, పొదుపు పథకాలు మరియు బీమా వంటి ఆకర్షణీయమైన పేర్లతో ప్రజలను ఆకర్షించారు. లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తే కొద్ది కాలంలోనే రెట్టింపు లాభాలు వస్తాయని, స్థిరమైన ఆదాయం సమకూరుతుందని నమ్మించడంతో, అనేక మంది తమ కష్టార్జితాన్ని, చివరకు ఆస్తులను అమ్మి మరీ ఈ సంస్థలో పెట్టుబడులు పెట్టారు. వేలాది మంది బాధితులు తమ జీవిత కాల పొదుపును ఈ సంస్థలో పోగొట్టుకున్నారు. గత కొంతకాలంగా చెల్లింపుల్లో జాప్యం చేస్తూ వస్తున్న యాజమాన్యం, చివరకు సంస్థ కార్యాలయాలను మూసివేయడంతో బాధితుల ఆందోళనలు మిన్నంటాయి. కష్టకాలంలో ఆదుకుంటుందని దాచుకున్న సొమ్ము ఆవిరి కావడంతో అనేక కుటుంబాలు వీధిన పడే పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం బాధితులు తమకు జరిగిన అన్యాయంపై పోలీసులను ఆశ్రయిస్తున్నారు. సంస్థ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని, తమ సొమ్మును తిరిగి ఇప్పించాలని కోరుతూ వివిధ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని అమాయక ప్రజలు ఈ మోసానికి ఎక్కువగా గురయ్యారు. మల్టీలెవల్ మార్కెటింగ్ సంస్థల పట్ల అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించినప్పటికీ, ఆకర్షణీయమైన లాభాల ఆశతో ప్రజలు ఇటువంటి సంస్థల ఉచ్చులో చిక్కుకోవడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భారీ కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు జరిపి, బాధ్యులను అరెస్ట్ చేయాలని మరియు బాధితులకు న్యాయం చేయాలని విపక్షాలు మరియు ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తును ముమ్మరం చేశారు.

# చర్లపల్లి ఆత్మహత్యల మిస్టరీలో బిగ్ ట్విస్ట్

(మొదటిపేజీ తరువాయి)

నమ్మిన వాళ్లే తన సంసారాన్ని చిన్నాభిన్నం చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. భార్యాబిడ్డలు పోయి తాను పుట్టెడు దుఃఖంలో ఉంటే, వారు చనిపోయిన కేవలం 25 రోజులకే ఆస్తి కోసం అత్తింటి వారు తనను బెదిరించడం మొదలుపెట్టారని ఆయన సంచలన విషయాన్ని బయటపెట్టారు. తన భార్యను మానసికంగా వేధించి, ప్రాణాలు తీసుకునే స్థితికి దిగజార్చింది తన అత్త, బావమరిదిలేనని ఆయన కుండబద్దలు కొట్టారు. ఆస్తి కోసం కన్న కూతురిని, మనవళ్లను కూడా చూడకుండా ఇంతటి దారుణానికి ఒడిగట్టారన్న వాదన ఇప్పుడు పెను దుమారం రేపుతోంది. తనకు అత్తింటి వారి నుంచి ప్రాణహాని ఉందని, తనకు రక్షణ కల్పించాలని సురేందర్ రెడ్డి పోలీసులను వేడుకున్నారు. "ఒకవేళ నాకు ఏమైనా జరిగితే నా ఆస్తిమొత్తం నా తల్లిదండ్రులకు, ఒక ట్రస్ట్‌కు చెందాలి తప్ప.. ఆ ద్రోహులకు ఒక్క రూపాయి కూడా దక్కకూడదు" అని ఆయన ఇప్పటికే వీలునామా రాసినట్లు సమాచారం. సొంత వాళ్లే నమ్మించి మోసం చేశారని, తన భార్య ప్రాణాలు తీసుకునేలా పరిస్థితులను సృష్టించారని ఆయన ఆరోపించారు. విజయారెడ్డి ఆత్మహత్య చేసుకున్న సమయంలో ఆమె వద్ద లభించిన వివరాల కంటే, ఇప్పుడు సురేందర్ రెడ్డి బయటపెడుతున్న వాస్తవాలు ఈ కేసును సరికొత్త కోణంలోకి తీసుకెళ్లాయి. మొదట్లో దీనిని సాధారణ ఆత్మహత్యగా భావించి కేసును క్లోజ్ చేసే పనిలో ఉన్న పోలీసులకు, ఇప్పుడు ఈ ఫిర్యాదు కొత్త సవాల్‌గా మారింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని విజయారెడ్డి నిజంగానే మానసిక ఒత్తిడితో చనిపోయిందా? లేక భర్త ఆరోపిస్తున్నట్లుగా అత్తింటి వారి వేధింపులే ఆమెను బలి తీసుకున్నాయా? అన్నది ఇప్పుడు తేలాల్సి ఉంది. ఒక సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ తన ఇద్దరు బిడ్డలను చంపి తాను చనిపోవడం వెనుక ఉన్న అసలు మిస్టరీ ఇప్పుడు అత్త, బావమరిది చుట్టూ తిరుగుతోంది.



## పవన్ కుమార్‌కు ఏఎన్ఎన్ అవార్డ్

### మోస్ట్ ట్రస్టెడ్ బ్రాండ్ ఆఫ్ ది ఇయర్ గా గుర్తింపు

**హైదరాబాద్, మహా:** వ్యాపార రంగంలో ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా కస్టమర్ల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే అసలైన విజయం. ఆ నమ్మకాన్నే పునాదిగా చేసుకుని 'గ్రీన్ పిక్సెల్ సెల్యులాయిడ్ ఎల్ఎల్‌పి' ద్వారా విశేష సేవలందిస్తున్న పవన్ కుమార్ పిదురును 'మోస్ట్ ట్రస్టెడ్ బ్రాండ్ ఆఫ్ ది ఇయర్2026' అవార్డు వరించింది. ఏఎన్ఎం మహా అవార్డ్స్ 2026 వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిధులుగా హాజరుకాగా.. ఈ కార్యక్రమంలో పవన్ కు అవార్డు ప్రధానం చేశారు. నాణ్యత మరియు పారదర్శకతే ధ్యేయంగా సాగుతున్న ఆయన ప్రయాణం ఎందరికో ఆదర్శం. పవన్ కుమార్ పిదురు తన సంస్థ ద్వారా సృజనాత్మకతకు పెద్దపీట వేస్తూ, వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందిస్తున్నారు. మార్కెట్లో పోటీని ఎదుర్కొంటూనే ఒక విశ్వసనీయ బ్రాండ్‌గా తన సంస్థను తీర్చిదిద్దడంలో ఆయన పడ్డ శ్రమ వెలకట్టలేనిది. సామాజిక బాధ్యతతో కూడిన వ్యాపార నిర్వహణ ఆయన ప్రత్యేకత. "సేవ మరియు నాణ్యత ఎప్పుడూ చేతులు కలిపితేనే సంస్థ దీర్ఘకాలం మనగలుగుతుంది" అని నమ్మే ఆయన, ఈ అవార్డును తన ఖాతాదారులకు అంకితం చేశారు. ఈ గుర్తింపు తనను మరింత బాధ్యతాయుతంగా పనిచేసేలా స్ఫూర్తినిస్తుందని ఆయన వేడుకలో పేర్కొన్నారు. ఏఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వేడుక జరగ్గా, ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, టీ ఫైబర్ ఎండీ వేణుప్రసాద్ పాల్గొన్నారు.

## డాక్టర్ సత్యనారాయణ గర్రెకు

## 'ఉత్తమ నెఫ్రాలజిస్ట్' పురస్కారం

### వైద్య రంగంలో విశేష సేవలకు గుర్తింపు... ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ -2026 ప్రదానం

**హైదరాబాద్, మహా:** ప్రముఖ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ మరియు ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ సత్యనారాయణ గర్రెను ప్రతిష్టాత్మక 'బెస్ట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ అవార్డు2026' వరించింది. వైద్య రంగంలో ఆయన కనబరుస్తున్న అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం మరియు సమాజం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను గుర్తిస్తూ ఈ అవార్డును అందజేశారు. ఏఎన్ఎన్ తెలుగు , మహా పత్రిక సంయుక్తంగా నిర్వహించిన 'ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ 2026' కార్యక్రమంలో భాగంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. హైదరాబాద్‌లోని కత్రియా హోటల్ అండ్ టవర్స్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిధులుగా హాజరైన కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ చేతులమీదుగా ఈ అవార్డు డాక్టర్ సత్యనారాయణ అందుకున్నారు. కిడ్నీ సంబంధిత వ్యాధుల చికిత్సలో, ముఖ్యంగా కిడ్నీ మార్పిడి మరియు ఇంటర్వెన్షనల్ నెఫ్రాలజీ విభాగాల్లో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలు ఎంతో మంది రోగుల జీవితాల్లో వెలుగులు నింపాయి. కేవలం చికిత్స అందించడమే కాకుండా, రోగుల పట్ల ఆయన చూపే కారుణ్యం,




మానవతా దృక్పథం ఈ అవార్డు ఎంపికలో కీలక పాత్ర పోషించాయి.వైద్య వృత్తికి వన్నె తెస్తూ, ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం శ్రమిస్తున్న డాక్టర్ సత్యనారాయణ గర్రెకు ఈ అవార్డు లభించడం పట్ల పలువురు వైద్య నిపుణులు, ప్రముఖులు మరియు రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమాజ హితం కోసం ఆయన చేస్తున్న కృషి మరిందరికి స్ఫూర్తిదాయకమని వారు కొనియాడారు. కార్యక్రమంలో ఏఎన్ఎన్ ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, కంది మౌనా శ్రీనివాసరెడ్డి, సీఈవో కంది రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## డాక్టర్ నిర్మల అగర్వాల్‌కు

## 'ఉత్తమ ఐవీఎఫ్ స్పెషలిస్ట్' పురస్కారం

### సంతాన సాఫల్య చికిత్స రంగంలో విశేష కృషికి గుర్తింపు

### .. ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ -2026 ప్రధానం

**హైదరాబాద్, మహా:** ప్రముఖ ఐవీఎఫ్ నిపుణులు డాక్టర్ నిర్మల అగర్వాల్ ను ప్రతిష్టాత్మక 'బెస్ట్ ఐవీఎఫ్ స్పెషలిస్ట్ ఆఫ్ ది ఇయర్2026' పురస్కారం వరించింది. సంతాన సాఫల్య చికిత్స విభాగంలో ఆమె కనబరుస్తున్న అసాధారణ అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం , ఎంతో మంది దంపతుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న ఆమె సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును అందజేశారు. హైదరాబాద్‌లోని కత్రియా హోటల్ అండ్ టవర్స్‌లో నిర్వహించిన 'ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ 2026' వేడుకకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిధులుగా హాజరుకాగా, ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు. ఏఎన్ఎన్ తెలుగు, మహా పత్రిక సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ నిర్మలకు 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్'ను అందజేశారు. వైద్య రంగంలో ఆమె అందిస్తున్న విశిష్ట సేవలు , రోగుల పట్ల ఆమె చూపే అంకితభావం అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. డాక్టర్ నిర్మల అగర్వాల్‌కు ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు వైద్య నిపుణులు , ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో సంస్థ సీఈవో కంది రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.



## డాక్టర్ పడిలం బెన్నా బాబుకు

## 'ఉత్తమ హెల్త్ కేర్ సర్వీస్' పురస్కారం

### వైద్య రంగంలో అసాధారణ సేవలకు గుర్తింపు

### .. ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ -2026 ప్రదానం

**హైదరాబాద్, మహా:** ఏపీలోని కాకినాడ జిల్లాకు చెందిన డాక్టర్ పడిలం బెన్నా బాబును ప్రతిష్టాత్మక 'ఉత్తమ హెల్త్‌కేర్ సర్వీస్ అవార్డు2026 వరించింది. ఆరోగ్య సంరక్షణ రంగంలో ఆయన కనబరుస్తున్న అసాధారణ అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం మరియు సమాజం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని కత్రియా హోటల్ అండ్ టవర్స్‌లో నిర్వహించిన 'ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ 2026' వేడుకకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయలు అతిధులుగా హాజరుకాగా, ఈ అవార్డును ప్రదానం చేశారు. ఏఎన్ఎన్ తెలుగు, మహా పత్రిక ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ బెన్నా బాబుకు 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్'ను అందజేశారు. ప్రజారోగ్య సంరక్షణలో మెరుగైన సేవలందిస్తూ, రోగుల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు.



## డాక్టర్ అనిరుధ్ కుమార్‌కు

## ప్రతిష్టాత్మక పురస్కారం

### పునర్నిర్మాణ శస్త్రచికిత్స విభాగంలో విశేష సేవలకు గుర్తింపు

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి చేతులమీదుగా ఏఎన్ఎన్ అవార్డ్

**హైదరాబాద్, మహా:** ప్రముఖ ఈఎన్టీ నిపుణులు , రీకన్‌స్ట్రక్టివ్ సర్జన్ డాక్టర్ ఆర్. అనిరుధ్ కుమార్ ను ప్రతిష్టాత్మక ఏఎన్ఎన్ అవార్డు2026' వరించింది. వైద్య రంగంలో ఆయన కనబరుస్తున్న అసాధారణ అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం , శస్త్రచికిత్స విభాగంలో ఆయన అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని కత్రియా హోటల్ అండ్ టవర్స్‌లో 'ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ 2026' వేడుకలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఈ అవార్డును ప్రదానం చేశారు. ఏఎన్ఎన్ నెట్‌వర్క్, మహా పత్రిక ఆధ్వర్యంలో సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిరుధ్ కుమార్ ను బెస్ట్ రైజింగ్ ఈఎన్ టీ, ఫేసియల్ ప్లాస్టిక్, స్కల్ బేస్ సర్జన్ ఆఫ్ ది ఇయర్ గా ఎంపికయ్యారు. పునర్నిర్మాణ శస్త్రచికిత్సల ద్వారా రోగుల జీవితాల్లో వెలుగులు నింపడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని నిర్వాహకులు పేర్కొన్నారు. వైద్య వృత్తి పట్ల ఆయన చూపిస్తున్న నిబద్ధత , రోగుల పట్ల ఆయనకు ఉన్న కరుణా హృదయం సమాజంపై సానుకూల ప్రభావం చూపుతున్నాయని ఈ సందర్భంగా కొనియాడారు. అమ్మన్యూస్ నెట్ వర్క్ ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి, టీ ఫైబర్ ఎండీ వేణుప్రసాద్ తదితరులు అవార్డు బహూకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## డాక్టర్ పవన్ చందనంకు

## ఏఎన్ఎన్ అవార్డ్

### ఉత్తమ ట్రామా అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్' పురస్కారం

### ఆర్థోపెడిక్ వైద్య విభాగంలో విశేష సేవలకు గుర్తింపు



**హైదరాబాద్, మహా:** ప్రముఖ ఆర్థోపెడిక్ నిపుణులు డాక్టర్ పవన్ చందనం ను ప్రతిష్టాత్మక 'ఉత్తమ ట్రామా అండ్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్ అవార్డు2026' వరించింది. వైద్య రంగంలో, ముఖ్యంగా ఎముకల వ్యాధుల చికిత్స మరియు కీళ్ల మార్పిడి శస్త్రచికిత్స విభాగంలో ఆయన కనబరుస్తున్న అసాధారణ అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం , సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు.హైదరాబాద్‌లోని కత్రియా హోటల్ అండ్ టవర్స్‌లో నిర్వహించిన 'ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ 2026' వేడుకకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ముఖ్య అతిధులుగా హాజరుకాగా, ఈ కార్యక్రమంలో అవార్డు ప్రధానం జరిగింది. ఏఎన్ఎన్, మహాపత్రిక సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ పవన్ చందనంకు 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్'ను అందజేశారు. క్లిష్టమైన ట్రామా కేసులు మరియు జాయింట్ రీప్లేస్‌మెంట్ శస్త్రచికిత్సల ద్వారా రోగులకు మెరుగైన జీవనాన్ని ప్రసాదించడంలో ఆయన చేస్తున్న కృషి అభినందనీయమని నిర్వాహకులు ఈ సందర్భంగా కొనియాడారు. అమ్మన్యూస్ నెట్‌వర్క్ ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎన్ సీఈవో కంది రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ పవన్ చందనంకు ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు వైద్య నిపుణులు, ప్రముఖులు, రోగులు హర్షం వ్యక్తం చేశారు.



## డాక్టర్ జి. లతకు

## 'ఉత్తమ ఫార్మకాలజిస్ట్' పురస్కారం

### ఫార్మకాలజీ విభాగంలో విశేష సేవలకు గుర్తింపు..

### ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ -2026 ప్రధానం

**హైదరాబాద్, మహా:** ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ జి. లత ను ప్రతిష్టాత్మక 'ఉత్తమ ఫార్మకాలజిస్ట్ అవార్డు2026' వరించింది. వైద్య రంగంలో, ముఖ్యంగా ఫార్మకాలజీ విభాగంలో ఆమె కనబరుస్తున్న అసాధారణ అంకితభావం, వృత్తిపరమైన నైపుణ్యం , సమాజానికి అందిస్తున్న విశిష్ట సేవలను గుర్తిస్తూ ఈ పురస్కారాన్ని అందజేశారు. హైదరాబాద్‌లోని కత్రియా హోటల్ అండ్ టవర్స్‌లో ఏప్రిల్ 11న నిర్వహించిన 'ఏఎన్ఎన్ మహా అవార్డ్స్ 2026' వేడుకకు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ ఈ అవార్డును ఘనంగా ప్రదానం చేశారు. ఏఎన్ఎన్ తెలుగు, మహా పత్రిక సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో డాక్టర్ లతకు 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్'ను అందజేశారు. ఔషధ విజ్ఞాన శాస్త్రంలో ఆమె చేస్తున్న కృషి మరియు ప్రజారోగ్య సంరక్షణలో భాగంగా ఆమె అందిస్తున్న సేవలు అభినందనీయమని నిర్వాహకులు ఈ సందర్భంగా కొనియాడారు. వృత్తి పట్ల ఆమె చూపిస్తున్న నిబద్ధత , సమాజం పట్ల ఆమెకు ఉన్న కరుణా హృదయం ఎంతో మంది జీవితాల్లో సానుకూల ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. డాక్టర్ జి. లతకు ఈ గౌరవం దక్కడం పట్ల పలువురు వైద్య నిపుణులు, ప్రముఖులు , సహచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో అమ్మన్యూస్ నెట్ వర్క్ ఛైర్మన్ కంది శ్రీనివాసరెడ్డి, సీఈవో కంది రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## స్వామి ముద్దంకు

## ప్రతిష్టాత్మక పురస్కారం

### ఏఐ, జర్నలిజం రంగంలో విశేష ప్రతిభకు గుర్తింపు



**హైదరాబాద్, మహా:** ఆర్టిఫిషియల్ జర్నలిజం రంగంలో పరిశోధనలు , సేవలకు గాను ఏఎన్ఎన్ మహా అవార్డు స్వామి ముద్దంను వరించింది. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అతిధులుగా హాజరైన కార్యక్రమంలో ఈ అవార్డును స్వామి ముద్దంకు అందజేశారు. ఈ అవార్డు అందుకోవడం ఎంతో గౌరవంగా, ఆనందంగా భావిస్తున్నానని, ఈ ప్రతిష్టాత్మక గౌరవాన్ని అందించినందుకు ఏఎన్ఎన్ మహా ఛైర్మన్ కంది శ్రీనివాస రెడ్డి కి, అ సీఈఓ కంది రామచంద్ర రెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గౌరవం తనను మరింత బాధ్యతతో, కట్టుబాటుతో ఏఐ ఆధారిత జర్నలిజం భవిష్యత్తు కోసం పనిచేయడానికి ప్రేరణనిస్తుందన్నారు.

# ఆలోచనను ఆచరణగా మార్చిన మహా దార్శనికుడు

## డా. బి.ఆర్. అంబేద్కర్

భారతీయ సామాజిక, రాజకీయ, ఆర్థిక చరిత్రలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్థానం అద్వితీయమైనది. ఆయన జీవితాన్ని, బహుముఖ ప్రజ్ఞాపాటవాలను లోతుగా అధ్యయనం చేస్తే అనేక కొత్త కోణాలు ఆవిష్కృతమవుతాయి. చాలామంది అంబేద్కర్ అనగానే కేవలం 'రాజ్యాంగ నిర్మాత' గానో లేక 'దళిత నాయకుడి' గానో మాత్రమే చూస్తుంటారు. కానీ ఆయన కేవలం ఒక వర్గానికి పరిమితమైన నాయకుడు కారు. భారతదేశంలో గౌతమ బుద్ధుని తర్వాత ఆ స్థాయి సామాజిక విప్లవాన్ని, సైద్ధాంతిక పునాదిని నిర్మించిన ఏకైక మహా దార్శనికుడు బాబాసాహెబ్ అంబేద్కర్. ఆయన ఒక ఆదర్శ సమాజం కోసం కలలు కనడమే కాదు, ఆ కలను సాకారం చేసేందుకు తన జీవితాన్ని ఒక యజ్ఞంలా మార్చుకున్న గొప్ప కర్మయోగి. ఒకవైపు సామాజిక రుగ్మతలపై రాజీలేని పోరాటం చేస్తూనే, మరోవైపు నవభారత నిర్మాణానికి అవసరమైన బలమైన పునాదులు వేసిన దార్శనికుడు.

### జ్ఞానాన్ని ఆయుధంగా మలుచుకున్న వైనం

అంబేద్కర్ తన విద్యాభ్యాసాన్ని కేవలం డిగ్రీలు సంపాదించడానికి, తన వ్యక్తిగత హోదాను పెంచుకోవడానికి పరిమితం చేయలేదు. కొలంబియా విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టిన నాటినుండి ఆయన అన్వేషణ మొదలైంది. భారతదేశ ఆర్థిక స్థితిగతులపై, కులాల పుట్టుకపై ఆయన చేసిన లోతైన పరిశోధనలు ఈ దేశపు మూలాలను ప్రశ్నించాయి. తాను నేర్చుకున్న జ్ఞానాన్ని సమాజం ఎదుర్కొంటున్న రుగ్మతలకు పరిష్కారాలు కనుగొనేందుకు ఉపయోగించారు. ఆయన చదివిన చదువులన్నీ సామాజిక విశ్లేషణకు ప్రాతిపదికలయ్యాయి. తన డిగ్రీలను ఒక ఆభరణంగా కాకుండా, తరతరాలుగా అణచివేతకు గురైన సామాజిక వర్గాల విముక్తి కోసం ఒక పదునైన ఆయుధంగా మలుచుకున్నారు. చరిత్రను కేవలం చదవడం మాత్రమే కాదు, అట్టడుగు వర్గాల కోణం నుంచి చరిత్రను తిరగరాయడం ఆయన తన పరిశోధనల ద్వారా ప్రారంభించారు.

### రాజకీయ చతురత - హక్కుల సాధన

స్వాతంత్ర్యోద్యమ కాలంలో జాతీయ నాయకులందరూ 'సైమన్ గో బ్యాక్' అని నినదిస్తే, అంబేద్కర్ మాత్రం నిశ్శబ్దంగా సైమన్ కమిషన్ ముందుకు వెళ్లి అణగారిన వర్గాలకు రాజకీయ హక్కులు, ఓటు హక్కు కావాలని బలంగా వాదించారు. ఇది పైకి జాతీయవాదానికి విరుద్ధంగా అనిపించినా, అణగారిన వర్గాల భవిష్యత్తు దృష్ట్యా ఆయన వేసిన అత్యంత వ్యూహాత్మక, సాహసోపేతమైన అడుగు అది. రౌండ్ టేబుల్ సమావేశాల్లో ఆయన లేవనెత్తిన "సోషల్ మైనారిటీస్" (సామాజిక మైనారిటీలు) అనే భావన అప్పటి రాజకీయాల్లో ఒక సంచలనం. మతపరమైన మైనారిటీలకు ఉన్న గుర్తింపు, హక్కులు ఈ దేశంలోని దళితులకు కూడా దక్కాలని ఆయన పోరాడారు. మహాత్మా గాంధీతో సైద్ధాంతికంగా ఢీకొని, తన వర్గం హక్కుల కోసం ఎంతటి పోరాటానికైనా సిద్ధపడిన ధీరోదాత్తుడు ఆయన. పూనా ఒప్పందం సమయంలో దేశ భవిష్యత్తు, తన ప్రజల ప్రాణరక్షణ కోసం ఒక అడుగు వెనక్కి వేసినా, ఆయన తన అంతిమ లక్ష్యం నుండి ఎప్పుడూ సడలలేదు.

### సైద్ధాంతిక తిరుగుబాటు - కుల నిర్మూలన దిశగా అడుగులు

1932 పూనా ఒప్పందం తర్వాత అంబేద్కర్ ఆలోచనా విధానంలో తీవ్రమైన మార్పు వచ్చింది. హిందూ సమాజం ఎప్పటికీ దళితులను సమానంగా చూడదని, ఈ వ్యవస్థలో ఉంటూ సామాజిక మార్పు సాధ్యం కాదని ఆయన గ్రహించారు. అందుకే 1936లో 'హిందువుగా పుట్టాను, కానీ హిందువుగా చావను' అని ఆయన చేసిన చారిత్రక ప్రకటన దేశవ్యాప్తంగా ఒక మహా విస్ఫోటనం సృష్టించింది. కుల నిర్మూలన కేవలం కులాంతర వివాహాల వల్లనో, సహపంక్తి భోజనాల వల్లనో మాత్రమే సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. కులానికి మూలమైన తాత్విక, మతపరమైన సిద్ధాంతాలను, అహేతుక గ్రంథాలను సమూలంగా నిర్మూలించకపోతే కుల వ్యవస్థ పోదని ఆయన కుండబద్దలు కొట్టారు. మతం నిజంగా ఒక ప్రజాస్వామిక విధానమే అయితే దానికి నిదర్శనంగా అన్ని కులాల వారికీ దేవాలయాల్లో పూజారులుగా, మతాచార్యులుగా అవకాశం ఇవ్వాలని ఆయన నాడు చేసిన ప్రతిపాదన ఎంతో ఆచరణాత్మకమైనది. ఆనాటి ఆయన ఆలోచనలే నేడు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న సామాజిక సంస్కరణలకు ప్రధాన పునాది.

### సమగ్ర ఆర్థిక దార్శనికత

అంబేద్కర్ కేవలం సామాజిక వేత్త మాత్రమే కాదు, అద్భుతమైన ఆర్థిక వేత్త కూడా. భారతదేశ భవిష్యత్తు కోసం ఆయన ప్రతిపాదించిన 'స్టేట్ సోషలిజం' ఎంతో వినూత్నమైనది. దేశ అభివృద్ధి జరగాలంటే భారీ పరిశ్రమలు, బ్యాంకులు, ఇన్సూరెన్స్ సంస్థలు అన్నీ ప్రభుత్వ ఆధీనంలోనే ఉండాలని ఆయన గట్టిగా నమ్మారు. వ్యవసాయ రంగంలో ఆయన చేసిన సూచనలు నేటికీ ఆచరణీయమే. వ్యవసాయ భూములను జాతీయం చేసి, సాగు చేయాలనుకునే రైతులకు వాటిని ప్రభుత్వమే లీజుకు ఇవ్వాలన్న ఆయన ప్రతిపాదన నాడు అమలై ఉంటే, నేడు దేశంలో ఇంత పెద్ద ఎత్తున ఆర్థిక అసమానతలు ఉండేవి కావేమో. ఒకవైపు కమ్యూనిస్టులు సాయుధ పోరాటాల వైపు మొగ్గు చూపుతున్న కాలంలో, అంబేద్కర్ ఒక ఉదారవాద ప్రజాస్వామిక వాదిగా ఉంటూనే భూమి జాతీయాకరణను ప్రతిపాదించడం ఆయనలోని భిన్నమైన, లోతైన ఆర్థిక దృష్టిని, అట్టడుగు ప్రజల శ్రేయస్సు పట్ల ఆయనకున్న నిబద్ధతను తెలియజేస్తుంది.

### ప్రజాస్వామ్య రూపశిల్పి - రాజ్యాంగ నిర్మాణం

భారత రాజ్యాంగ నిర్మాతగా బాబాసాహెబ్ పాత్ర గురించి ఎంత చెప్పినా తక్కువే. రాజ్యాంగ రచనలో ప్రతి అక్షరాన్ని అణగారిన, బలహీన వర్గాల అభ్యున్నతికి రక్షణ కవచంగా మలిచారు. ఆయన కేవలం ఎస్సీ, ఎస్టీలకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించడానికే పరిమితం కాలేదు. వెనుకబడిన వర్గాలందరికీ సామాజిక న్యాయం జరగాలన్న ఉద్దేశ్యంతోనే రాజ్యాంగంలో 340, 46 ఆర్టికల్స్ ను ప్రత్యేకంగా పొందుపరిచారు. ఈ ఆర్టికల్స్ ఆధారంగానే నేడు ఓబీసీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయి. అలాగే, ప్రాంతీయ, భాషా మైనారిటీల హక్కుల పరిరక్షణకు, కొత్త రాష్ట్రాల ఏర్పాటుకు సంబంధించిన ఆర్టికల్ 3ని తీర్చిదిద్దడంలో ఆయన చూపిన దూరదృష్టి అనన్య సామాన్యం. ఒక రాష్ట్రం విడిపోవాలంటే ఆ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానమే అంతిమం అయితే, ఆ రాష్ట్రంలోని మైనారిటీ ప్రాంతాలకు మెజారిటీ వర్గాల వల్ల ఎప్పటికీ న్యాయం జరగదని గ్రహించి, ఆ అధికారాన్ని పార్లమెంటుకు కట్టబెట్టిన మహానుభావుడు అంబేద్కర్.

### హేతుబద్ధమైన అన్వేషణ - బౌద్ధ ధర్మ స్వీకరణ

అంబేద్కర్ బౌద్ధమతాన్ని స్వీకరించడం వెనుక ఎలాంటి ఆకస్మిక భావోద్వేగాలు లేవు. ఏళ్ల తరబడి జరిపిన మేధోమథనం, హేతుబద్ధమైన విశ్లేషణ తర్వాతే ఆయన ఆ చారిత్రక అడుగు వేశారు. తన అనుచరులకు సరైన మార్గదర్శకత్వం లేకుండా బౌద్ధాన్ని స్వీకరించమని చెప్పడం సరికాదని భావించి, 'బుద్ధ అండ్ హిస్ ధమ్మ' అనే ప్రామాణిక గ్రంథాన్ని రచించారు. బుద్ధుడి జీవితంపై ఉన్న అనేక పౌరాణిక, అవాస్తవ కథనాలను పక్కనబెట్టి, యుద్ధ నివారణ కోసం నిలబడిన గౌతముడే నిజమైన బుద్ధుడిగా మారాడనే చారిత్రక, హేతుబద్ధమైన వాదనను ఆయన ప్రపంచం ముందు ఉంచారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే మూడు మూలస్తంభాల మీద మాత్రమే ఒక ఆదర్శ సమాజం నిలబడాలని ఆయన ఆకాంక్షించారు. భారతీయ సమాజంలో అత్యంతగా లోపించిన ఈ 'సౌభ్రాతృత్వాన్ని' బౌద్ధ ధర్మం ద్వారానే పునరుద్ధరించగలమని ఆయన ప్రగాఢంగా విశ్వసించారు. "తత్వవేత్తలు ఈ ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించారు, కానీ అసలు విషయం ఏమిటంటే దాన్ని మార్చడం" అన్న మాటలకు నిలువెత్తు రూపం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్. ఆయన కేవలం గ్రంథాలు రాసి, సిద్ధాంతాలు వల్లించి ఊరుకోలేదు. ఆ సిద్ధాంతాలను ఆచరణలో పెట్టి, అడుగడుగునా ఎదురైన అవరోధాలను అధిగమించి, వాటిని ఒక లాజికల్ ఎండ్‌కు తీసుకువెళ్లారు. ఆయన జీవితం ఆసాంతం విశ్రమమెరుగని ఒక మహా సంగ్రామం. నేటి యువత, విద్యార్థులు, మేధావులు దళిత, బహుజన సమాజాలు అంబేద్కర్ ను కేవలం విగ్రహాలకు పూలమాలలు వేయడానికో, నినాదాలు చేయడానికో పరిమితం చేయకూడదు. ఆయన ఆలోచనలను, అక్షరాలను లోతుగా అధ్యయనం చేసి ఆకళింపు చేసుకోవాలి. సమకాలీన సమాజంలో దళితులు, పేదలు ఎదుర్కొంటున్న సామాజిక, ఆర్థిక సమస్యలకు అంబేద్కర్ అయితే రాజ్యాంగబద్ధంగా ఎలాంటి పరిష్కారాలు చూపి ఉండేవారు అన్న కోణంలో ఆలోచించి ముందుకు సాగాలి. బ్రాహ్మణవాదం, పెట్టుబడిదారీ విధానం అనే రెండు ప్రధాన రుగ్మతలపై ఏకకాలంలో సైద్ధాంతిక పోరాటం చేసిన ఆ మహాయోధుని ఆశయాలను ఆచరణాత్మకంగా ముందుకు తీసుకువెళ్లడమే మనం బాబాసాహెబ్ కు అర్పించే నిజమైన, అర్థవంతమైన నివాళి.

-ప్రొద్దువాక భీమరావు
99486 35844



# అంబేద్కర్ అవసరం ఇప్పుడు ఉంది



కులం మతం మత్తులో జోగుతున్న నేటి యువత నించి పిల్లల వరకు అందరూ అంబేద్కర్ని చదవాలి. ఆలోచన విస్తృత పరచుకుని సమాజం లో ఒక సామాజిక విప్లవం రగలాలి. ఇప్పుడు జరుగుతూ ఉన్న పరిస్థితులను చూస్తుంటే దేశంలో ఆయన వంద యేళ్లు ముందు పుట్టేసాడు కానీ ఆయన అవసరం ఇప్పుడు ఉంది. ఇండియా నీడ్స్ డాక్టర్ సాబ్ అని మాత్రం అనిపిస్తుంది. నేను అంబేద్కర్ ని అత్యంత ఎక్కువ ఇష్టపడడాన్ని చూసి నన్ను చాలా మంది మీరు మాదిగోళ్ళా అనో... మాలోల్లా అనో... దళితులా అనో sc లా అని అడిగారు తప్ప అంబేద్కర్ ని తక్కువ చేసి మాట్లాడినట్లు అనిపిస్తేనే నీ క్లోజ్ ఫ్రెండ్ ని కూడా దూరం చేసుకునేంత ఎందుకంత ఇష్టమనో, ఆయనలో ఏం నచ్చిందనో ఎవరూ అడగలేదు. వాళ్లు తెలుసుకోవాలనుకోరు ఎందుకంటే అంబేద్కర్ ఒక పేరు కాదు, ఒక తిరుగుబాటు. ఆ తిరుగుబాటును అర్థం చేసుకోవాలంటే, వాళ్లు నిలబడిన నేలనే ప్రశ్నించాలి.

ఒక వేళ ఎవరైనా అంబేద్కర్ ను కాకుండా తాము నెహ్రూని ఇష్టపడుతున్నామంటే వారిని మీరు బ్రాహ్మణులా అని ఎవరూ అడగరు..అలానే సర్వేపల్లి రాధాకృష్ణన్ ఇష్టం అంటే మీరు బ్రాహ్మణులా అని ఎవరూ అడగరు.అలానే గాంధీ ఇష్టం అంటే మీరు కోమట్లా అని ఎవరూ అడగరు.ఎందుకంటే వీరంతా అగ్ర కులాల వాళ్ళు. వారిని "అందరి వాళ్లు"గా చూడటం అలవాటు అయింది. కానీ అంబేద్కర్ విషయంలో మాత్రం ఆయనను ఒక కులానికి మాత్రమే కట్టిపడేయాలనే ప్రయత్నం జరుగుతుంది. రాజశేఖర్ రెడ్డి విషయంలోనో, NTR విషయంలోనో అయితే మీరు రెడ్లా ,కమ్మలా అనకుండా వారిని అందరివాడిగా చూడాలంటారు. ఏదేమైనా ఈ దేశంలో అణగారిన వర్గం కోసం అణగారిన వాడే పోరాడాలి.వాడు ఆ వర్గానికే పరిమితమవ్వాలి. ఒక వేళ వీరి కోసం అగ్ర కులం వారు ఎవరైనా పోరాడితే అతన్ని యుగపురుషుడిగానో,చారిత్రక చైతన్యంగానో చూడాలి అంతే.అణగారిన వర్గం వాడు మాత్రం అందరికోసం పోరాడాడు అనే మాటనే ఒప్పుకోలేరు. ఇక నిజంగా పోరాడితే తట్టుకోలేక ఒక కులానికి మాత్రమే పరిమితం చేసి తమ లేకీతనాన్ని ప్రదర్శించుకుంటారు ప్రపంచం అంతా అంబేద్కర్ ని మేధావిగా, మానవతావాదిగా గౌరవిస్తుంటే, మన దేశంలో మాత్రం ఆయనను ఒక కులం గోడల్లో బంధించాం. ఆయన ఆలోచనలు విశ్వవ్యాప్తం. కానీ మనం ఆయనను ఒక వాడ మూలలో నిలబెట్టిన విగ్రహంగా మార్చేశాం.

ఇప్పటి రాజకీయాలను ఏ కోణంలో చూసినా ఎరుపు, కాషాయం, బులుగు అనే రంగుల తేడా లేకుండా ప్రతి వర్గం బి.ఆర్. అంబేద్కర్ గారిని "మనవాడు"గా ప్రకటించుకోవాలని చూస్తోంది. కానీ లోతుగా గమనిస్తే వారు ఆయన పేరును మాత్రమే స్వంతం చేసుకోవాలని చూస్తున్నారు ఆయన ఆలోచనలను మాత్రం కాదు. ఒక యూనివర్సిటీ ప్రొఫెసర్ చెప్పిన మాట చాలా అర్థవంతంగా ఉంటుంది. "Ambedkar's ideas have their own teeth. If you don't have an appetite for them, you can't swallow them." అంటే, అంబేద్కర్ ఆలోచనలు సులభంగా జీర్ణించుకునే విధంగా ఉండవు. వాటిని అర్థం చేసుకోవాలంటే మన దృష్టి విశాలంగా ఉండాలి. లేదంటే మనం ఆయన పేరునే వాడగలుగుతాం గానీ, ఆయన భావజాలాన్ని మోయలేం.

అంబేద్కర్ తత్వాన్ని పరిశీలిస్తే, ఆయన ఆలోచనల విశాలత స్పష్టంగా తెలుస్తుంది. ఆయనకు "మానవ హక్కులు" అంటే కేవలం రాజకీయ స్వేచ్ఛలు మాత్రమే కాదు సామాజిక, ఆర్థిక సమానత్వం కూడా అంతే ముఖ్యమైనవి. ప్రపంచంలో ఆదర్శంగా చెప్పుకునే ఫ్రెంచ్, అమెరికన్ ప్రకటనలు ఎక్కువగా సివిల్, పొలిటికల్ రైట్స్ మీదే దృష్టి పెట్టాయి. కానీ అంబేద్కర్ మాత్రం హక్కుల సమగ్రతను సోషల్, ఎకనామిక్, పొలిటికల్ రైట్స్ పరస్పర సంబంధాన్ని గాఢంగా అర్థం చేసుకున్నారు.

అందుకే ఆయన రచనల్లోనూ, ఆలోచనల్లోనూ మూడు మూల సూత్రాలు ఎప్పుడూ కనిపిస్తాయి స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం. ఈ మూడు విలువలు నిజంగా ఆచరణలోకి వస్తేనే సమాజంలో వివక్షకు స్థానం ఉండదు. ఇదే మానవ హక్కుల అసలు గుండెచప్పుడు. స్టేట్స్ అండ్ మైనారిటీస్ వంటి రచనల్లో కూడా ఆయన ఈ విషయాలను స్పష్టంగా వివరించారు. అంతేకాకుండా, 26 జనవరి 1950న రాజ్యాంగ సభలో ఆయన చేసిన ప్రసంగంలో ఒక గాఢమైన హెచ్చరిక ఉంది "రాజకీయంగా సమానత్వం ఉన్నా, సామాజిక ఆర్థికంగా అసమానత కొనసాగితే, అది ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలో పడేస్తుంది." ఈ మాటలు ఆయన ఆలోచనల లోతును, దూరదృష్టిని మనకు తెలియజేస్తాయి. అంబేద్కర్ సాధించిన విజయాలను చూస్తే ఆయన ఒక విద్యావేత్త, ఆర్థికవేత్త, సామాజిక శాస్త్రవేత్త, రాజకీయ నాయకుడు అని చెప్పడం సులభం. కానీ ఆయన గొప్పతనం అక్కడితో ఆగిపోదు.

ప్రపంచంలో ఎన్నో తత్వవేత్తలు ఉన్నారు అరిస్టాటిల్, కార్ల్ మార్క్స్, వోల్టేర్, జాన్‌జాక్ రూసో, మ్యాక్స్ ముల్లర్ వంటి వారు. వీరిని ప్రపంచం ఎక్కువగా వారు చనిపోయిన తర్వాత గుర్తించింది. కానీ అంబేద్కర్ విషయంలో ఒక ప్రత్యేకత ఉంది. ఆయన పుట్టింది సమాజం అణగదొక్కిన, అంటరానితనంతో బాధపడుతున్న వర్గంలో. విద్య నేర్చుకోవడమే కష్టమైన పరిస్థితుల్లో ఆయన తన ప్రయాణాన్ని ప్రారంభించారు. తరగతి గదిలో కూడా బయట కూర్చొని వినాల్సిన రోజుల్లో ఆయన చదువుకున్నారు. అయినా ఆయన వెనుకడుగు వేయలేదు. కొందరు అభ్యుదయవాదుల సహకారంతో, ప్రపంచస్థాయి విద్యను అభ్యసించి, తనను తాను తీర్చిదిద్దుకున్నారు. ఆయన రచనలు కేవలం పుస్తకాలు కాదు సమాజంలోని అన్యాయాన్ని ఛేదించే ఆలోచనల అస్త్రాలు. ఆయన కేవలం సమస్యలను విశ్లేషించలేదు పరిష్కార మార్గాలను కూడా చూపించారు. దేశానికి అవసరమైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం వంటి విలువలను సరైన దిశలో నిర్వచించారు. వేల ఏళ్లుగా అణగారిన ప్రజలను, బానిసత్వంలో ఉన్న వర్గాలను, రాజ్యాంగం మరియు హక్కుల రూపంలో స్వేచ్ఛ వైపు నడిపించారు. రక్తపాతం లేకుండా, హింస లేకుండా, కోట్ల మంది జీవితాల్లో మార్పు తీసుకువచ్చిన నాయకుడు ఆయన. అందుకే నా దృష్టిలో అంబేద్కర్ ఒక నాయకుడు మాత్రమే కాదు ఒక మార్గదర్శి, ఒక దార్శినికుడు. ప్రపంచ అత్యుత్తమ మేధావుల్లో ఆయన ఎప్పటికీ ముందు వరసలో నిలుస్తారు. ఎందుకంటే ఆయన ఆలోచనలు కాలానికి అతీతం. మరొక వందేళ్లు గడిచినా, వాటి విలువ ఏమాత్రం తగ్గదు.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గురించి మాట్లాడేటప్పుడు ఆయనను కేవలం రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే చూసి ఆపేస్తే, అది ఆయన వ్యక్తిత్వాన్ని అసంపూర్ణంగా చూపించినట్టే అవుతుంది. ఎందుకంటే ఆయనలోని ఆలోచనల విస్తృతి, అధ్యయనాల లోతు, ముఖ్యంగా ఆర్థిక శాస్త్రం పై ఉన్న పట్టును గుర్తించకుండా ఆయనను అర్థం చేసుకోవడం అసాధ్యం. ఎకనామిక్స్లో పీహెచ్డీ చేసిన మొదటి భారతీయుడిగా, అలాగే మొదటి సౌత్ ఏషియన్గా ఆయన నిలిచిన విషయం ఆయన మేధస్సుకు నిదర్శనం. అంబేద్కర్ సాబ్ కేవలం సామాజిక న్యాయ యోధుడే కాదు, దేశ ఆర్థిక వ్యవస్థను సమానత్వ దిశగా నడిపించాలనే దృఢ సంకల్పం కలిగిన గొప్ప ఆర్థికవేత్త కూడా. ఆయన ప్రతి ఆలోచనలో దేశ ప్రయోజనం, పేద ప్రజల సంక్షేమం ప్రధానంగా కనిపిస్తాయి. అందుకే అంబేద్కర్ను అర్థం చేసుకోవాలంటే, ఆయన ఆలోచనలను సంపూర్ణంగా చదవాలి, విశ్లేషించాలి, ఆచరణలో పెట్టాలి.

- బసడ సంపత్ యాదవ్
70321 32593

# జిల్లాలో డీజీపి పర్యటన

## పలు కార్యక్రమాలకు హాజరైన శివధర్ రెడ్డి.. పోలీస్ అధికారులతో సమీక్ష

**ఆదిలాబాద్ మహా :** తెలంగాణా రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి ఆదిలాబాద్ జిల్లాలో సోమవారం పర్యటించారు. ఆదిలాబాద్ పట్టణంతో పాటు జిల్లాలోని ఆదిలాబాద్ రూరల్ మండలం, గుడి హత్నూర్ , ఉట్నూర్ మండలాలలోని పలు ప్రాంతాలలో చేపట్టే కార్యక్రమాలకు ఆయన జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఏఎస్పీలు మౌనిక, సురేందర్ రావు, డీఎస్పీ జీవన్ రెడ్డి లతో కలిసి హాజరయ్యారు. జిల్లాలో తొలి ట్రాఫిక్ పార్కును డీజీపీ ప్రారంభించారు. విద్యార్థి దశ నుండే ట్రాఫిక్ నియమ నిబంధనలు నేర్చుకునేలా అణువుగా ఉండేందుకు జిల్లాలో మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఆర్టీసీ బస్సులలో సురక్ష పేరుతో ఏర్పాటుచేసిన 175 సిసి కెమెరాలను ప్రారంభించారు. అనంతరం పోలీస్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు లొంగిపోయిన మావోయిస్టులకు ఇళ్లస్థలాల ప్రోసీడింగ్ కాపీలను అందించారు అరైవ్ అలైవ్" కార్యక్రమంలో భాగంగా మైనర్ డ్రైవింగ్ చేసిన వారు , వారి తల్లిదండ్రులకు రాష్ట్ర డిజిపి బి శివధర్ రెడ్డి కౌన్సిలింగ్ నిర్వహించారు. స్థానిక పోలీసు ఏఆర్ హెడ్ క్వార్టర్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పలు విషయాలను సూచించారు. మైనర్ డ్రైవింగ్ చేయడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని అన్నారు.తల్లిదండ్రులు ఎట్టి పరిస్థితుల్లోనూ పిల్లలకు సరైన వయస్సు వచ్చేంతవరకు వాహనాలను ఇవ్వవద్దని సూచించారు. అటు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో 'అభయ మై టాక్సీ ఇస్ సేఫ్ కార్యక్రమంలో ఆటో



డ్రైవర్ల కు పలు సూచనలు చేసారు. ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా ఖాకీ దుస్తులు ధరించాలని, అది వారికి ప్రత్యేక గుర్తింపునిస్తుందని సూచించారు. ప్రయాణికుల భద్రతే ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ రహదారి నిబంధనలు పాటించాలని కోరారు. ఆదిలాబాద్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సీసీ కెమెరాలను ప్రారంభించారు. నేరాల నియంత్రణలో సీసీటీవీ కెమెరాల పాత్ర కీలకంగా ఉంటుందని ఆయన తెలిపారు. ఒక కెమెరా 100 మంది పోలీసు సిబ్బందితో సమానంగా వ్యవహరిస్తుందని తెలిపారు. ప్రజలు, వ్యాపార సంస్థలు, తమ గ్రామాలలో పట్టణాలలో వీధులలో స్వచ్ఛందంగా ప్రతి ఒక్కరూ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. నేరస్తులు సీసీటీవీ కెమెరాలు ఉన్న ప్రదేశాలలో నేరాలను చేయడానికి భయపడతారని తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద నేరాల నియంత్రణ 24గంటలు క్రమం తప్పకుండా జరుగుతూ ఉంటుందని అన్నారు. సిసీ కెమెరాలు రక్షణ కవచంలా పనిచేస్తాయని, ప్రతి ఒక్కరూ వీటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సహకరించిన చాంబర్ ఆఫ్ కామర్స్, పట్టణ ప్రముఖులను అభినందించారు. పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించిన ఆపరేషన్ జ్వాలా, ఖాకీ కిడ్స్ ముగింపు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆడపిల్లలకు ధైర్యం, ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు ఆపరేషన్ జ్వాలా ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఖాకీ కిడ్స్ కార్యక్రమాన్ని అభినందించారు. విద్యార్థులతో ట్రాఫిక్ నియమ నిబంధనలు, సైబర్ క్రైమ్ నేరాలు జరగకుండా అరికట్టేందుకు అవగాహన కల్పించినట్టు తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని మావలనందు ఇంటెలిజెన్స్ డిపార్ట్మెంట్ కు చెందిన మూడు డిఎస్పి, సిఐ, ఎస్ఐ క్వార్టర్స్ లను ప్రారంభించారు. జరిగింది. ఆదిలాబాద్ రూరల్ మండలం చించుఘాట్ లో లైబ్రరీని ప్రారంభించారు.ఆదివాసీలతో కలిసి భోజనం చేసారు. ఆదివాసీ ప్రజలు అన్నిరంగాలలో రాణించాలని ఆకాంక్షించారు. ఆదివాసీ యువత లైబ్రరీలో పుస్తకాలు చదువుతూ పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావాలని కోరారు. అనంతరం గుడిహత్నూర్ మండల కేంద్రంలో సర్పంచులు , 500 మంది రోడ్ సేఫ్టీ క్లబ్ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. గ్రామ స్థాయిలో సర్పంచులు తీర్మానాలు చేసి ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం, మత్తు పదార్థాల వినియోగాన్ని నివారించడం వంటి అంశాలపై ప్రజలకు చైతన్యం కల్పించాలని సూచించారు.రోడ్ సేఫ్టీ క్లబ్ సభ్యులకు ఫస్ట్ ఎయిడ్ కిట్లు అందచేసారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల లబ్ధి అందేలా ప్రభుత్వం కృషి

..బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి మహా:** అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ పథకాలు అందేలా కృషి చేస్తామని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకట్ స్వామి పేర్కొన్నారు. సోమవారం రోజు బెల్లంపల్లి నియోజకవర్గం కన్నెపల్లి మండలంలోని జజ్జరెల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన కార్యక్రమంలో కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ పథకం చెక్కులను స్థానిక శాసన సభ్యులు గడ్డం వినోద్ వెంకటస్వామి అధికారులతో కలిసి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మొత్తం 36 మంది లబ్ధిదారులకు రూ.36,04,176 విలువైన చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,ఆడపిల్లల వివాహాల సమయంలో కుటుంబాలపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న కళ్యాణ లక్ష్మి-షాదీ ముబారక్ పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకాల లబ్ధి అందేలా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆర్థిక సహాయం ఎంతో తోడ్పడుతుందని, సమాజంలో ఆడపిల్లల పట్ల గౌరవం పెరగడంలో కూడా ప్రభుత్వ పథకాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు.సంక్షేమ పథకాల అమలులో పారదర్శకతను పాటిస్తూ, నిజమైన లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు.అనంతరం చెక్కులు అందుకున్న లబ్ధిదారులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.అనంతరం కన్నెపల్లి మండలం జజ్జరెల్లి గ్రామపంచాయతీకి చెందిన మాజీ సర్పంచు తోపాటు ఆరుగురు వార్డు సభ్యులు కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోందని, పార్టీలో చేరిన వారికి తగిన గౌరవం, అవకాశాలు కల్పిస్తామని తెలిపారు.మరింత మంది ప్రజలు అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సృజన నర్సింగరావు, మండలానికి చెందిన ఆయా గ్రామపంచాయతీ సర్పంచులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## ప్రజలందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

.. తాళ్ళ గురజాల పోలీస్ స్టేషన్ ఎస్సై రామకృష్ణ

**బెల్లంపల్లి, మహా:** బెల్లంపల్లి మండలంలోని గ్రామీణ ప్రజలందరూ రోడ్డుభద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని ఎస్సై రామకృష్ణ పేర్కొన్నారు. సోమవారంరోజు చంద్రవెల్లి గ్రామంలో ప్రజాపాలనలో భాగంగా గ్రామ సర్పంచ్ చిలుముల శ్రీనివాస్ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ పై గ్రామ సభ నిర్వహించడం జరిగింది. గ్రామసభ కు ముఖ్యఅతిథిగా తాల్లగురిజాల రామకృష్ణ పాల్గొని గ్రామంలోనీ డ్రైవర్లకు ప్రజలకు రోడ్ సేఫ్టీ పై అవగాహనకల్పించి అందరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని అందరితో ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచు గజెల్లి రాజ్ కుమార్ వార్డు సభ్యులు రాసకొండ రజిత,కంపెల గంగ, జాడి అన్నపూర్ణ, పోలవేణి రాజన్న, రంగ నాగరాజు, అవునూరి భాగ్య,పంచాయతీకార్యదర్శి ప్రశాంత్,గా ఎస్ఐ బాబాజీ, మాజీ ఉపసర్పంచ్ కంపెల చంద్రశేఖర్, నాయకులు కళ్యాణం శంకర్,రియాజ్ ,పూదరి గణేశ్, గ్రామంలోని టో డ్రైవర్లు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనడం జరిగింది.

## నూతన కల్వర్టు పరిశీలన – బూర్గంపాడు అభివృద్ధికి వేగం

**బూర్గంపహాడ్ మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండల కేంద్రంలో అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో 9వ వార్డులో నిర్మించిన నూతన కల్వర్టును బూర్గంపాడు సర్పంచ్ మందా నాగరాజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుండె వెంకన్నతో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, మండల కేంద్రంలో మట్టి రోడ్లు పూర్తిగా లేకుండా చేసి, పక్కా రోడ్ల నిర్మాణం చేపట్టడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇందుకోసం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సహకారంతో రూ.50 లక్షల గ్రాంట్‌ను మంజూరు చేయించుకుని అభివృద్ధి పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.గ్రామంలో మౌలిక వసతులు మెరుగుపరచడానికి తీసుకుంటున్న చర్యలను గ్రామస్తులు అభినందించారు. కల్వర్టు నిర్మాణం పూర్తికావడంతో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గుతాయని, రాకపోకలు సులభతరం అవుతాయని వారు పేర్కొన్నారు.అభివృద్ధి దిశగా ముందుకు సాగుతున్న సర్పంచ్‌కు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



## మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిని కలిసిన మైనార్టీ నాయకులు

**భద్రాచలం మహా :** భద్రాద్రి పునరేకీకరణ లక్ష్యంగా నిర్వహించిన విస్తృత స్థాయి అఖిలపక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మాజీ కేంద్రమంత్రి, రాజ్యసభ సభ్యురాలు శ్రీమతి రేణుకా చౌదరిని ఈరోజు భద్రాచలంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మైనార్టీ అధ్యక్షులు మహమ్మద్ ఖాన్ మరియు రాష్ట్ర మైనార్టీ నాయకులు నయీమ్ ఖురైషి గారు ఆమెను కలిసి, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు భద్రాద్రి పునరేకీకరణ అంశంపై రేణుకా చౌదరి గారు చూపిస్తున్న చొరవను, అఖిలపక్ష సమావేశం ద్వారా ప్రజల గొంతుకను వినిపిస్తున్న తీరును అభినందించారు. అనంతరం జిల్లాలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు మరియు మైనార్టీల సంక్షేమ కార్యక్రమాలపై ఆమెతో చర్చించారు. ఈ కార్యక్రమంలో పార్టీకి చెందిన ఇతర ముఖ్య నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



## సారపాక గ్రామ సభలో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం

**బూర్గంపహాడ్ మహా:** ప్రజా పాలనప్రగతి ప్రణాళిక 13 నుండి ఏప్రిల్ 18 వరకు జరిగే కార్యక్రమంలో భాగంగా సారపాక గ్రామంలో సోమవారం నాడు గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కిషోర్ నాయక్, ఎస్సై మెడ ప్రసాద్, పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. మేజర్ గ్రామపంచాయతీలో ప్రమాదాలు నివారణకు తగిన చర్యలు చేపట్టనున్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కలిగించి, ప్రమాదాలు తగ్గించేందుకు ప్రతిజ్ఞ చేశారు. గ్రామంలో రోడ్డు భద్రతపై అందరూ సహకారం అందించాలని కోరారు.





## భద్రాచలంలో రేణుకా చౌదరి రామాలయ దర్శనం

### అఖిలపక్ష సమావేశానికి హాజరు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా** భద్రాచలంలో ప్రసిద్ధి చెందిన శ్రీ సీత రామచంద్ర స్వామి వారి దేవస్థానం వద్ద ఈరోజు ఆధ్యాత్మిక, రాజకీయ వాతావరణం నెలకొంది. మాజీ కేంద్ర మంత్రివర్యులు రేణుక చౌదరి స్వామివారి దర్శనార్థం ఆలయాన్ని సందర్శించారు.దర్శనం అనంతరం భద్రాచలం నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు, జిల్లా గ్రంథాలయ శాఖ అధ్యక్షులు పసుపులేటి వీరబాబు, పీసీసీ నాయకులు బట్ట మోహన్ గాంధీతో పాటు భద్రాచలం డివిజన్ కాంగ్రెస్ కార్యకర్తలు ఆమెను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఆలయ ప్రాంగణంలో జరిగిన ఈ భేటీ స్నేహపూర్వకంగా సాగింది.ఈ సందర్భంగా రేణుకా చౌదరి ప్రత్యేక పూజల్లో పాల్గొని రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ప్రార్థించారు. అనంతరం స్థానిక కాంగ్రెస్ నాయకులతో సమావేశమై ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతంపై చర్చించారు.తరువాత భద్రాద్రి పునరేకీకరణపై నిర్వహించిన అఖిలపక్ష సమావేశానికి కూడా ఆమె హాజరై తన మద్దతు తెలియజేశారు. భద్రాచలం ప్రాంతానికి సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం అన్ని వర్గాలు కలిసికట్టుగా పని చేయాల్సిన అవసరం ఉందని ఆమె అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంతో భద్రాచలం ప్రాంతంలో కాంగ్రెస్ కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నెలకొంది. నాయకురాలి పర్యటన పార్టీ శ్రేణులకు మరింత ఉత్సాహాన్ని నింపిందని స్థానిక నేతలు తెలిపారు.

## వేతన ఒప్పందం జాప్యంపై జేసీఎల్ వరంగల్‌కి ఐఎన్టియుసి మిత్రపక్షాల వినతి

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపహాడ్ మండలం సారపాక ఐటీసీ కర్మాగారంలో జరుగుతున్న 14వ వేతన ఒప్పందం జాప్యం పై ఐఎన్టీయూసీ మిత్రపక్షల ఆధ్వర్యంలో జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్ వరంగల్ కార్యాలయంలో సూపరడెంట్ గౌతమి గారికి వినతి పత్రాన్ని అందజేసి పరిశ్రమలో పరిస్థితి ఐఎన్టీయూసీ మిత్రపక్షాల ప్రధాన కార్యదర్శి యారం పిచ్చిరెడ్డి వివరిస్తూమా పరిశ్రమలో కార్మికుల విషయంలో గుర్తింపు సంఘం మరియు యాజమాన్యం నిర్లక్ష్య ధోరణి కార్మికుల హక్కులకు భంగం పై మీ తక్షణ జోక్యం అవసరమని ప్రస్తుతం మా పరిశ్రమలో యాజమాన్యం, గుర్తింపు సంఘంతో గత 6 నెలల నుండి 14 వ వేతన ఒప్పంద చర్చలు సాగిస్తున్నారు. మా పరిశ్రమలో సాలీనా ఉత్పత్తి 70 వేల టన్నుల నుంచి 8 లక్షల టన్నులకు పెరిగినా, కార్మికుల జీవన ప్రమాణాలు ఏ మాత్రం మెరుగుపడ లేదనిగత 13వ మరియు ప్రస్తుత 14వ వేతన ఒప్పందం ప్రస్తుత గుర్తింపు సంఘం చేస్తున్నప్పటికీ, కార్మికులకు హామీలు ఇచ్చిన మాదిరిగా వేతనాలు పెంచక పోవడం గుర్తింపు సంఘం యొక్క వైఫల్యానికి నిదర్శనం అని అన్నారు. ప్రస్తుత వేతన ఒప్పందంలో ప్రతి కార్మికునికి నెలకు 22000/ పెంపు సాధిస్తామని, 100% అన్ లిమిటెడ్ మెడికల్ సౌకర్యం కల్పిస్తామని, రిటైర్మెంట్ బెనిఫిట్ 12 లక్షలు సాధిస్తామని, పరిశ్రమ స్థాపించి 50 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా, గిఫ్ట్ 10 gr గోల్డ్ కాయిన్ సాధిస్తామని, శ్రీరామనవమికి పెయిడ్ హాలిడే సాధిస్తామని, మ్యాన్ పవర్ తగ్గించకుండా, అలాగే రిక్రూట్మెంట్ విధానం ESP□బదిలీఎంప్లాయ్ అయ్యే



విధంగా అగ్రిమెంట్ చేస్తామని, VDA పాయింటు కు రూ. లు 6/ చొప్పున పెంపు చేస్తామని చెప్పి, కార్మికులచే ఓట్లు వేయించుకుని గెలిచి, ఇచ్చిన హామీలను మరచి 6 నెలల గడిచినప్పటికీ వేతన ఒప్పందం పూర్తి కాలేదనిఇప్పుడు యాజమాన్యం ఒప్పుకోవడం లేదని, నష్టాల్లో ఉందని కుంటిసాకులు చెబుతూ కార్మికుల తప్పుదోవ పట్టిస్తున్నారు.ఇంత జరుగుతున్నా యాజమాన్యం కళ్ళు మూసుకుని కూర్చోవడమే కాకుండా, వీరికి వత్తాసు పలుకుతూ 18 నెలల క్రితం TNTUC నీ గెలిపించటానికి దొంగ జాబ్ నోటిఫికేషన్ ఇచ్చి ఇప్పటికీ పూర్తి చేయకుండా బదిలీ మరియు కాంట్రాక్ట్ కార్మికులను నట్టేట ముంచుతోంది. మన కాంట్రాక్ట్ సోదరులు ఇప్పటికే సమ్మె నోటీసులు ఇచ్చి యుద్ధానికి సిద్ధమయ్యారు. రిలే నిరాహారదీక్షలు ప్రారంభించారన్నారు. ఏ క్షణం లో నైనా సమ్మెలోకి వెళ్ళే అవకాశం ఉంది కాబట్టి పై సమస్యలు అత్యంత ప్రాధాన్యత గా భావించి మీ తక్షణ జోక్యం చేసుకుని ఉత్పత్తికి, పారిశ్రామిక శాంతికి భంగం కలగకుండా చర్యలు చేపడతారని కోరుకుంటున్నామన్నారు ఈ కార్యక్రమంలో ఐఎన్టియుసి మిత్రపక్షాల నాయకులు వినోద్. సలీం. పోతిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి. సాయిరాం. కూచిపూడి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు

## తాళ్లకమూరు పంచాయతీ తరపున ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో సత్తా చాటిన విద్యార్థులకు చిరు సన్మానం

**బూర్గంపహాడ్ మహా :** బూర్గంపాడు మండలం సారపాక గ్రామ తాళ్లకమురు పంచాయతీకి చెందిన గోవిందు యశ్విత, ఇంటర్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో MPC విభాగంలో 1000 మార్కులకు గాను 992 మార్కులు మరియు కేసుగాని సతీష్ కుమార్ MPC విభాగం లో 1000 మార్కులకు గాను 987 మార్కులు సాధించి భద్రాచలం లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కళాశాలలో జయ కేతనం ఎగరవేయడం జరిగింది.ఈ సందర్భంగా తాళ్లగొమ్మూరు ఈవో మురళి, సర్పంచ్ కృష్ణవేణి, ఉప సర్పంచ్ బేబీ గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు పెద్దలు కలిసి చిరు సన్మానం చేయడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ వారి గ్రామానికి చెందిన పిల్లలు ఇలాంటి ఫలితాలు తీసుకురావడం మాకు మా గ్రామానికి చాలా సంతోషంగా ఉందని ముందు ముందు మరెన్నో ర్యాంకులు సాధించి గ్రామపంచాయతీ పేరును వారి తల్లిదండ్రుల పేరును నిలబెడతారని తమ సంతోషాన్ని తెలియజేశారు.అలాగే కళాశాల యాజమాన్యం, యస్విత తల్లిదండ్రులు గోవిందు వెంకటేశ్వర్లు, అనుష అలాగే సతీశ్ కుమారు తల్లి తండ్రులు కేసుగాని శ్రీను, శైలజ కూడా తమ పిల్లల కళాశాలలో మెరుగైన మార్కులు రావడంతో ఎంతో గర్వంగా ఉందని తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు.





## రైతన్నలతో ఉపసర్పంచ్ గుండె వెంకన్న ముఖాముఖి

- ఈ ఏడాది రైతులకు బంగారం పండింది
- మార్కెట్ యార్డులో రైతులకు వసతులు కల్పించే విధంగా చూస్తాం

**బూర్గంపహాడ్ మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మార్కెట్ యార్డులో యాసంగి ధాన్యం కొనుగోళ్లకు సిద్ధం అయ్యాయి, కొనుగోళ్ల కేంద్రం కి ధాన్యం భారీగా వచ్చి చేరడంతో ఈ నెల 15వ తేది కొనుగోళ్ల కేంద్రం ప్రారంభించడానికి సర్వం సిద్ధం చేసిన పిఎసిఎస్ సిబ్బంది. ఈ క్రమంలో బూర్గంపహాడ్ గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ గుండె వెంకన్న మార్కెట్ యార్డ్ రైతులతో ముఖాముఖి అయ్యారు. దేవుడి దయతో ఈ ఏడాది ధాన్యం అధిక దిగుబడితో పండడం,మా రైతులకు బంగారం పండింది అని అన్నారు,రైతులకు ఇది పండుగ చేసుకునే సందర్భం అని అన్నారు. రైతుల ధాన్యం వెంటనే కొనుగోళ్లు చేసే విధంగా అధికారులతో మాట్లాడం జరిగింది అని అన్నారు. రైతులకు కావాల్సిన వసతులు ఏర్పాటు చేయాలి అని మార్కెట్ యార్డు సంబంధిత అధికారులతో మాట్లాడడం జరిగిందని ఉపసర్పంచ్ గుండె వెంకన్న అన్నారు.

# రోడ్డు భద్రత మనందరి భద్రత

- ఎస్ఐ మేడ ప్రసాద్
- మండలంలో 'అరైవ్అలైవ్' కార్యక్రమాలు
- ప్రజలకు భద్రత నియమాలు అవసరం

**బూర్గంపహాడ్ మహా :** రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా మండలంలో 'అరైవ్అలైవ్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని బూర్గంపహాడ్ ఎస్ఐ మేడ ప్రసాద్ అన్నారు. అరైవ్ అంటే ఇంట్లో నుంచి ఎలా వెళ్లామో... అలైవ్ అంటే అదేవిధంగా సురక్షితంగా ఇంటికి రావడం అని వివరించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక లో భాగంగా నేటి నుండి అనగా ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు 'అరైవ్అలైవ్' కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు స్థానిక SI మేడ ప్రసాద్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు అత్యధికంగా జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు, రోడ్డు వెంట ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో మృతిచెందుతున్నారని అన్నారు, కావున ప్రజలకు అవగాహన లోపం కారణమే దీనికి నిదర్శనం అని, ప్రతి ఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించడం అవసరం అని, గ్రామంలో ప్రమాదాలకు నిలయంగా ఉన్న ప్రదేశాల్లో గుంతలను తాత్కాలికంగా పూడ్చి, మూలమలుపుల వద్ద పెరిగే చెట్లను వాటి పొదలను గ్రామ పంచాయతీ తరపు తొలగించాలని స్థానిక SI మేడ ప్రసాద్ బూర్గంపహాడ్ సర్పంచ్ మందా నాగరాజు ను కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మందా నాగరాజు, ఉపసర్పంచ్ గుండె వెంకన్న, ట్రైని ఎస్ఐ దేవ్ సింగ్, డిప్యూటీ తహసిల్దార్ సమ్మయ్య, పంచాయతీ ఈఓ బర్ల ప్రభాకర్ గ్రామ పంచాయతీ పాలక మండలి సభ్యులు అదేవిధంగా గ్రామ పెద్దలు అడ్వకేట్ భజన సతీష్ కుమార్,యువ నాయకులు భజన ప్రసాద్ కుమార్, ఎడమకంటి సుధాకర్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు, గ్రామ ప్రజలు, గ్రామ యువత, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.





## డాక్టర్ అంబేద్కర్ కు బ్రాహ్మణోత్తముడి నివాళి

**బూర్గంపహాడ్ మహా :** ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత, భారత బాబాసాహెబ్ డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ విగ్రహం చేయి విరిగి ఆయనకు అవమానంగా కనిపిస్తున్న సమయంలో భద్రాచలం రామాలయంలో పూజారిగా పనిచేస్తున్న వనం నంద అనే బ్రాహ్మణోత్తముడు, డా. బి ఆర్ అంబేద్కర్ భావజాలాలు కలిగిన వ్యక్తి స్వయంగా తానే చేతిని బాగు చేసి, నిలువెత్తు విగ్రహానికి రంగు వేసి అంబేద్కర్పై ఉన్న ప్రేమ, గౌరవాన్ని చాటుకోవడం పలువురిని ఆశ్చర్యానికి గురి చేసింది. భావజాలానికి కుల, మత, వర్ణ, వర్ణ బేధాలు లేవని మరొకసారి చాటి చెప్పిన వనం నందా గారికి అభినందనలు... మీలా అందరూ తారతమ్యాలు లేకుండా జీవిస్తే ఈ భారతదేశ సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు.

## ఏజెన్సీ భూముల అక్రమాలను వెలికితీయాలి: బిజెపి డిమాండ్

**దమ్మపేట ,మహా :** 1/70చట్టాన్ని పూర్తిగా తుంగలో త్రొక్కి , అక్రమార్కులకు అండగా నిలబడిన రెవిన్యూ కార్యకలాపాల పై ఉన్నత స్థాయి అధికారులు పూర్తి స్థాయిలో విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు సోమవారం భారతీయ జనతా పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ నాయుకులు తంబళ్ల రవి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ అక్రమ భూ బదలాయింపులపై ఉన్నత స్థాయి అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను తక్షణమే గుర్తించి... భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. గత 30సం.రాలుగా అక్రమ భూ బదలాయింపులకు పాల్పడిన రెవెన్యూ సిబ్బంది ని గుర్తించి కఠినంగా శిక్షించాలని ,అదేవిధంగా ఫోర్జరీ పాస్ పుస్తకాలపై ఉన్నత స్థాయి అధికారులచే విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు .1/70యాక్ట్ ని,ఏజెన్సీ చట్టాలను తుంగలో తొక్కుతూ అక్రమ పద్ధతిలో భూ హక్కులు పొందిన వారి పై చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు,పసుమర్తి పుల్లారావు,స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొలిక పోగు ముసలయ్య, మాజీ జిల్లా సెక్రటరీ సీనియర్ నాయకులు ఉడతనేని విశ్వేశ్వరరావు,మాజీ యస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు గూడా ముత్యాల రావు,దొడ్డా సతీష్,పూచి ప్రసాద్,సొరకాయల సీతారాములు,కారం రత్నా కుమారి, అల్లా సుజాత మరియు భూ బాధితులు పాల్గొన్నారు.

# భద్రాద్రి పునరేకీకరణపై అఖిలపక్ష సమావేశం

పొదెం వీరయ్య కీలక వ్యాఖ్యలు

**భద్రాచలం మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన భద్రాద్రి పునరేకీకరణ విస్తృత స్థాయి అఖిల పక్ష సమావేశంలో తెలంగాణ రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర విభజన అనంతరం భద్రాచలం ప్రాంతంలోని గిరిజన, గిరిజనేతర ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని ఆయన తెలిపారు. ఇప్పటికే పలు మార్లు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు మరియు గవర్నర్‌ను కలిసి, భద్రాచలానికి చెందిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని విజ్ఞప్తి చేసినప్పటికీ ఇప్పటివరకు సమస్యకు పరిష్కారం లభించలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం భద్రాచలం నియోజకవర్గంలో ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వెళ్లాలంటే సుమారు 10 కిలోమీటర్ల మేర ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం గుండా ప్రయాణించాల్సిన పరిస్థితి ఉందని ఆయన వివరించారు. ఈ పరిస్థితి ప్రజలకు తీవ్రమైన ఇబ్బందులను కలిగిస్తోందని అన్నారు.అదేవిధంగా భద్రాచలం పట్టణంలో అంత్యక్రియల కోసం సరైన స్థలం కూడా లేకపోవడం బాధాకరమని, ఆ ఐదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలంలో విలీనం చేస్తే ఈ సమస్యలు చాలావరకు పరిష్కారమవుతాయని అభిప్రాయపడ్డారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయానికి సంబంధించిన భూములు కూడా ఆంధ్రప్రదేశ్‌లోని పురుషోత్తపట్నం ప్రాంతంలో ఉండటం వల్ల భక్తులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. కాబట్టి ఇకనైనా తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు ప్రత్యేక చొరవ తీసుకుని ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించి, ఆ ఐదు గ్రామపంచాయతీలను తిరిగి భద్రాచలంలో విలీనం చేయాలని పొదెం వీరయ్య విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశం ద్వారా భద్రాద్రి పునరేకీకరణ అంశం మరోసారి ప్రాధాన్యత సంతరించుకుంది.



## విశ్వనాథపల్లి ఎత్తిపోతల పథకాన్ని పున ప్రారంభించండి

**జిల్లా మంత్రులు రైతుల ఆవేదనను ఆలకించండి...**



**కారేపల్లి, మహా:** కారేపల్లి మండలం పరిధిలోనే విశ్వనాథపల్లి గ్రామంలో గల ఎత్తిపోతల పథకం నిర్విరామంగా తయారయింది. దీంతో ఎత్తిపోతల పక్కన కింద ఉన్న రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, జిల్లా మంత్రులు రైతుల మొర ను ఆలకించి ఎత్తిపోతల పునర్నిర్మాణ పనులను చేపట్టాలని జిల్లా మంత్రులను రైతులు వేడుకుంటున్నారు. 2000లో విశ్వనాథపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని బుగ్గ వాగు సమీపంలో సుమారు 12 లక్షల 32 వేల రూపాయల వ్యయంతో ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి రాజ్యసభ సభ్యులు ఎలమంచిలి రాధాకృష్ణమూర్తి తన వాటా నిధులుగా 7.12 /డి ఆర్ డి ఏ ద్వారా 5.20 లక్షలు రూపాయల తో ఈ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేసి ఎలమంచిలి రాధాకృష్ణ, అప్పటి సుజాతనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు రామ్ రెడ్డి వెంకట్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. 107 మంది రైతులకు సంబంధించిన 200 ఎకరాలకు పైగా మాగాన్ని భూమి సాగులోకి వచ్చింది. మూడు చెరువులు ఈ ఎత్తిపోతల ద్వారా నింపి వాటి కిందనే ఉన్న పంట పొలాలను రైతులు కొంతకాలం పండించుకున్నారు. అయితే కొంతకాలం తర్వాత ఎత్తిపోతల పథకానికి సంబంధించిన విద్యుత్ మోటర్లు తరచుగా మరమ్మతులు కు చేరుకోవడంతో వాటిని పట్టించుకోకుండా రైతులు వదిలేశారు. దీంతో ఎత్తిపోతల పథకం పూర్తిగా నిర్వీరామమైంది. ఆ మూడు చెరువుల కింద ఉన్న 200 ఎకరాలు భూములు కేవలం ఒక పంటకే పరిమితమై పోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ శాఖ మాత్యులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రైతుల మొర ను పరిగణంలోకి తీసుకొని ఎత్తిపోతల పథకానికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి అందుబాటులో తేవాలని కోరుతున్నారు. 20 హెచ్ పి సామర్థ్యం గల మోటార్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించకపోయారని, రైతులు తెలిపారు. ఈ విషయమై సోమవారం గ్రామ సర్పంచ్ ఇస్లావత్ రాజు ఆధ్వర్యంలో రైతు ల బృందం సంబంధిత ఎత్తిపోతల పథకాన్ని సంబంధించిన ప్రదేశాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఇస్లావత్ రాజు మాట్లాడుతూ రైతుల ఆవేదనను అర్థం చేసుకొని సంబంధిత మంత్రులు ఎత్తిపోతలకు సంబంధించిన విద్యుత్ మోటార్లను ఏర్పాటు చేయించి, రైతులకు అందుబాటులో తీసుకురావాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఎత్తిపోతలకు సమీపంలో చెక్ డాం ఏర్పాటు చేయడంతో చెరువులను నింపేందుకు అవసరమైన నీటి నిల్వ ఉన్నాయని, తక్షణమే మోటర్ ఏర్పాటు చేసి రైతుల పంట భూములు సాగులోకి తీసుకురావాలని రైతులు, సర్పంచు రాజు కోరారు.

## అశ్వారావుపేట అభివృద్ధిపై మంత్రి తుమ్మలతో ఎమ్మెల్యే, మున్సిపల్ ప్రజాప్రతినిధుల భేటీ

**తెలంగాణ ముఖద్వారం అశ్వారావుపేట ఆదర్శంగా ఉండాలి : తుమ్మల**



**దమ్మపేట, మహా :**తెలంగాణా కు ముఖద్వార మైన అశ్వారావుపేట మున్సిపాలిటీ రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీ గా అభివృద్ధి లో ముందుండాలని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆకాంక్షించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో అశ్వారావుపేట మున్సిపాలిటీ ప్రజాప్రతినిధులు సోమవారం దమ్మపేట మండలం గండుగులపల్లిలో మంత్రి తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్, వివిధ వార్డుల కౌన్సిలర్లు మరియు ముఖ్య నాయకులు ఉన్నారు.అశ్వారావుపేట ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉండటంతో మన రాష్ట్రానికి ఇది ముఖద్వారం అని ఏపీ వైపు నుండి వచ్చే వారు తెలంగాణలోకి ప్రవేశించగానే అశ్వారావుపేట పట్టణం ఎంతో ఆహ్లాదకరంగా, అందంగా కనిపించేలా సుందరీకరణ పనులు చేపట్టాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచేలా అశ్వారావుపేట ముందు ఉండాలని మంత్రి స్పష్టం చేశారు. చైర్మన్, వైస్ చైర్మన్ మరియు కౌన్సిలర్లు వార్డుల వారీగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తూ, మున్సిపల్ కమిషనర్లతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో జూపల్లి రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు మరియు పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని తమ సమస్యలను మంత్రికి వివరించారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**తక్షణ చర్యలకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రజల నుండి అందిన వినతిపత్రాలు ఫిర్యాదులను అదనపు కలెక్టర్ వేణుగోపాల్, ఆర్డీవో మధు, గృహనిర్మాణ శాఖ పిడి రవీంద్రనాథ్ తో కలసి స్వీకరించారు. జిల్లా నలు మూలల నుండి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ వ్యక్తిగత సామూహిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి ఫిర్యాదును శ్రద్ధగా పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సమస్యలపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని మిగిలిన వాటిని నిర్ణీత గడువులో పూర్తిచేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న తహసీల్దారులు ఎంపీడీవోలు ఇతర సంబంధిత అధికారులతో మండలాల వారీగా అందిన సమస్యలను నేరుగా చర్చించి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రతి వినతిపత్రాన్ని సమగ్రంగా పరిశీలించి సమస్యల మూలాలను గుర్తించి దీర్ఘకాలిక పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రజలు తమ ఫిర్యాదులను పూర్తి వివరాలతో పాటు అవసరమైన ఆధార పత్రాలతో సమర్పిస్తే పరిష్కారం వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని ప్రతి సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం అందేలా అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు. అనంతరం వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని, ప్రధాన కూడళ్లలో ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాలు తక్షణం ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## “అరైవ్ – అ లైవ్” గోడపత్రికను ఆవిష్కరించిన కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఈనెల13 నుండి 18 వరకు నిర్వహించనున్న “అరైవ్ - అ లైవ్” కార్యక్రమాల గోడపత్రికను జిల్లా కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని తెలిపారు. ప్రతి సంవత్సరం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో మానవ తప్పిదాలే ప్రధాన కారణమవుతున్నాయని పేర్కొంటూ వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. “అరైవ్ - అ లైవ్” కార్యక్రమాల ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించడం ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడం లక్ష్యమని వివరించారు. హెల్మెట్ ధరించడం సీటుబెల్ట్ వినియోగం అధిక వేగంతో వాహనాలు నడపకపోవడం మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా ఉండడం వంటి భద్రతా చర్యలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. యువత ముఖ్యంగా ట్రాఫిక్ నియమాలను గౌరవిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాల భాగంగా గ్రామసభలు అవగాహన ర్యాలీలు పాఠశాలలు కళాశాలల్లో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు డ్రైవర్లకు శిక్షణ శిబిరాలు ప్రజలకు అవగాహన కల్పించే వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటరమణ సిబ్బంది ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మొబైల్ సేల్స్ అండ్ సర్వీస్.. అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**మణుగూరు, మహా :**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సబ్‌డివిజన్ పరిధిలోని మొబైల్ సేల్స్ అండ్ సర్వీస్ యజమానుల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మణుగూరు మండలంలోని హనుమాన్ టెంపుల్ సమీప అర్బన్ పార్క్ (వెన్నెల జలపాతం) ప్రాంగణంలో జరిగిన సమావేశంలో మణుగూరు, అశ్వాపురం, బయ్యారం, కరకగూడెం, పినపాక మండలాలకు చెందిన మొబైల్ షాపుల యజమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా కాగితాల శంకర్ రెడ్డి, కార్యదర్శిగా జిజావత్ సురేష్, కోశాధికారిగా చామకూర సాంబశివరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వంశీ, అఖిల్, సద్దాం ఎన్నిక కాగా, గౌరవ అధ్యక్షుడిగా యాదగిరి రామారావు, గౌరవ సలహాదారులుగా ఎస్.డి రఫీ, పసునూరి రాము, మేడిద కమలాకర్‌లను నియమించారు.అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శంకర్ రెడ్డి మాట్లాడుతూ యూనియన్ 2019లో ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి రెండు సంవత్సరాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మళ్లీ తనను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. సభ్యులందరికీ సమాన న్యాయం చేస్తూ బాధ్యతను నిబద్ధతతో నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. మణుగూరు సబ్‌డివిజన్ పరిధిలోని మొబైల్ వ్యాపారులందరూ ఐక్యంగా ఉండి అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మొబైల్ సర్వీసింగ్, స్పేర్ పార్ట్స్ కొనుగోళ్లలో సమిష్టి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా వ్యాపార అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మణుగూరు, అశ్వాపురం, బయ్యారం, కరకగూడెం, పినపాక మండలాలకు చెందిన మొబైల్ షాపుల యజమానులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## రేణుకా చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో కలపాలని డిమాండ్ చేస్తూ భద్రాచలంలో నిర్వహిస్తున్న సమరభేరి కార్యక్రమంలో పాల్గొనటానికి జిల్లాకు విచ్చేసిన రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం పాల్వంచ నవభారత్ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ పుష్పగుచ్ఛం అందజేసి ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు ప్రజా సమస్యలు ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు.

## ప్రమాదాల నివారణే ప్రధాన లక్ష్యం

**రోడ్డు భద్రతపై గ్రామస్థాయిలో విస్తృత అవగాహన.. జిల్లా కలెక్టర్ అంకిత్**



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్వహిస్తున్న రోడ్డు భద్రత వారోత్సవాల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ కార్యక్రమాలలో భాగంగా సోమవారం చుంచుపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామ సభకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. మార్చి 6 నుండి ప్రారంభమైన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు హెల్త్ క్యాంపులు నిర్వహించడంతో పాటు డీఅడిక్షన్ కౌన్సిలింగ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజలను ప్రత్యక్షంగా భాగస్వాములుగా చేసుకుంటూ అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి రోజు అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ రోడ్డు ప్రమాదాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరిలో బాధ్యతాయుతమైన ప్రవర్తన అవసరమని అన్నారు. ఈ గ్రామసభల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకువచ్చి ప్రమాదాలను తగ్గించడం ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించడం రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించడం ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవడం వంటి చర్యలు చేపడుతున్నామని చెప్పారు. అలాగే ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవలు సమయానికి అందుబాటులో ఉన్నాయా సమీప ఆసుపత్రులకు కనెక్టివిటీ ఎలా ఉందనే అంశాలను కూడా ఈ గ్రామసభల ద్వారా సమీక్షిస్తున్నామని వివరించారు.పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు హెల్మెట్ సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజేసేలా చేయాలని సూచించారు. ఇది ఏ ఒక్క శాఖకు సంబంధించిన విషయం కాదని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాద రహిత జిల్లాను సాధించగలమని అన్నారు.కొన్ని జిల్లాలో అమలు చేస్తున్న “నో హెల్మెట్ - నో ఎంట్రీ” వంటి వినూత్న చర్యలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని అలాంటి ఆలోచనలను మన జిల్లాలో కూడా అనుసరించాలని సూచించారు. అతివేగం డ్రంక్ అండ్ డ్రైవ్ హెల్మెట్ ధరించకపోవడం సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాల వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని వీటిపై విస్తృతంగా అవగాహన కల్పించి ప్రమాదాలను నివారించాలని పిలుపునిచ్చారు.అన్ని శాఖలు సమన్వయంతో ఈ రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, తాసిల్దార్ నాగరాజు, పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేతనాల్లో వివక్షత తగదు



- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాల్సిందే
- లేకుంటే కార్మికులతో కలిసి పోరాటం
- సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్యా రమేష్
- సీఐటీయూ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు

**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**అసంఘటిత కార్మికులకు సమాన పనికి సమాన వేతనం అమలయ్యే వరకు పోరాటం కొనసాగించాలని అంబేద్కర్ కలలుగన్న కార్మిక వర్గ సమానత్వం కోసం కార్మిక వర్గం ఐక్యంగా కృషి చేయాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ కార్మిక వర్గాన్ని కోరారు. సిఐటియు ఆధ్వర్యంలో సామాజిక పోరాట నాయకుల వారోత్సవాల సందర్భంగా కొత్తగూడెం పట్టణంలో కార్మికుల పని ప్రాంతాల వద్ద సోమవారం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా భూక్య రమేష్ మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని కార్మికుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్మికూలు అందరూ సమానంగా ఉండే రాజ్యాన్ని సాధించుకున్నప్పుడే అంబేద్కర్ కు అసలైన నివాళులు అని ఆయన అన్నారు. అసంఘటిత కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మిక వర్గానికి ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని కోరారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంబేద్కర్ కలలుగన్న కార్మిక రాజ్య స్థాపన కోసం కృషి చేయాల్సిన కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలే కార్మిక హక్కులను కాలరాస్తూ వేతనాల్లో వివక్షత చూపెడుతూ అంబేద్కర్ కోరుకున్న రాజ్యానికి తూట్లు పొడుస్తున్నారని తెలిపారు. పని ప్రాంతంలో ఒకే పనులను చేస్తున్న కార్మికులకు ఒకే విధమైన వేతనాలు అమలు చేయకుండా వివక్షత చూపెడుతూ కార్మిక వర్గ వ్యతిరేకంగా విధానాలు అమలు చేస్తున్న పాలకులకు వ్యతిరేకంగా ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. కనీస వేతనం అమలు చేయాలని కోర్టులు చట్టాలు కార్మిక వర్గానికి అనుకూలంగా ఉన్నప్పటికీ నేడు పరిపాలన చేస్తున్న పాలకులు మాత్రం కార్మికుల చట్టాలు అమలు చేయకపోగా వేతనాల్లో వివక్షత చూపెట్టడం సరైనది కాదని పాలకవర్గాలకు బుద్ధి చెప్పే విధంగా అంబేద్కర్ ఆశయ సాధన కోసం బడుగు బలహీన వర్గాల కోసం వారు అభివృద్ధి కోసం హక్కుల సాధన కోసం కడవరకు పోరాటం చేసిన అంబేద్కర్ నడిచిన దారిలో కార్మిక వర్గం పోరాటాలు కొనసాగించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, అంబాల దుర్గమ్మ, పట్టణ నాయకులు నందిపాటి రమేష్, మున్సిపల్ సింగరేణి కాంట్రాక్టు కార్మిక సంఘం నాయకులు వెంకటమ్మ, సంజీవ్, పాషా, గిద్ద శ్యాం కుమార్, గూగులోత్ సక్రాం, భాస్కర్, రాణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**పాల్వంచ మండలంలోని బోల్లారిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ అంకిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించి విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు.తనిఖీలలో భాగంగా పరీక్ష హాళ్లలో విద్యార్థుల కూర్చునే విధానం ప్రశాంత వాతావరణం తగిన వెలుతురు తాగునీటి సదుపాయం విద్యుత్ ఫ్యాన్లు శుభ్రత వంటి మౌలిక వసతులను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి సరైన దూరం పాటిస్తూ కూర్చునేలా చర్యలు తీసుకోవాలని పరీక్ష సమయంలో ఎటువంటి అంతరాయాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థంగా ఉండాలని అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాల పంపిణీ సమాధాన పత్రాల సేకరణ భద్రపరిచే విధానం వంటి అంశాలను పరిశీలించి పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత నిష్పక్షపాతత పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా కట్టుదిట్టమైన పర్యవేక్షణ ఉండాలని మాల్ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ సహాయకరంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రత్యేకంగా విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు. ఈ తనిఖీలు కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చాలి

- బిఎంఎస్ నేత నాగేశ్వరరావు
- జిఎం సివిల్ అధికారికి వినతిపత్రం



**భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మహా:**భానుడి ప్రతాపం వల్ల కాంట్రాక్ట్ కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎండలను దృష్టిలో పెట్టుకొని సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళలు మార్చే విధంగా చర్యలు తీసుకోవాలని బిఎంఎస్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన కార్పొరేట్ జిఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఎస్ఈ సివిల్ రాజేంద్రప్రసాద్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సింగరేణి కోల్ మైన్స్ కాంట్రాక్ట్ మజ్దూర్ మజ్దూర్ సంగ్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు మాట్లాడారు. వేసవి కాలం కావడంతో ఓసిలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని అలాగే పారిశుధ్య కార్మికులు రోడ్స్ క్లీనింగ్ పార్కులలో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. మండుతున్న ఎండల సమయంలో ప్రతి సంవత్సరం కూడా మానవతా దృక్పథంతో అన్ని ఏరియాలలో కూడా ఉదయం 6 గంటలకే పని ప్రారంభించి మధ్యాహ్నానికి ఎండలు ముదిరే సమయానికి పని ముగించేలా పనివేళలు మార్పు చేస్తారని ఈ సంవత్సరం కూడా అలా సహకారాన్ని కొనసాగిస్తూ పనివేళలో మార్పు చేయాలని కోరారు. అలాగే వివిధ డిపార్ట్మెంట్లో పనిచేస్తున్న అన్ని విభాగాల కాంట్రాక్ట్ కార్మికులకు ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులకు ప్రైవేటు వాహన డ్రైవర్లకు కోల్ ట్రాన్స్పోర్ట్ ఓబి వర్కర్స్ కు మజ్జిగ ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేయాలని వర్కర్లకు సంబంధించి పని ప్రదేశాలలో చలవ పందిల్లు ఏర్పాటు చేయాలని ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని వడదెబ్బ నుండి కాపాడుకునేలా సీజనల్ వ్యాధులు వల్ల అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి నిర్మల, ఎడ్ల రాకేష్, కళ్యాణ్ చక్రవర్తి, అశ్విని, నాహిద్, అరుణ, జయ తదితరులు పాల్గొన్నారు.

## డిప్యూటీ సిఎం పర్యటనపై అధికారులతో భేటీ



**దమ్మపేట ,మహా :** మండలంలో ఈ నెల 15 వ తేదీ బుధవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ,విద్యుత్ శాఖా మంత్రి మల్లు భట్టివిక్రమార్క పర్యటించనున్నారు. ఈ క్రమంలో నియోజకవర్గ ,మండల స్థాయి అధికారులతో అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలోని జగ్గారం ,మల్లారం గ్రామాల్లో శంఖుస్థాపన కు సిద్దంగా ఉన్న విద్యుత్ సబ్ స్టేషన్ ల పనులను ఆయన పరిశీలించారు. ఉపముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన చేయబడేందుకు సిద్దంగా అన్ని ఏర్పాట్లను అధికారుల తో కలిసి పర్యవేక్షించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏడి ,డిఇఇ , ఏఇఇ లతో పాటుగా మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఇదేం పద్ధతి సారూ....!

**విద్యార్థులతో ధాన్యం ఆరబోత పనులు ఏపీ నుంచి మంగాపురంతండాకు**

**తరలింపు ఎర్రటి ఎండలో ధాన్యం ఆరబోసిన విద్యార్థులు**



**నేలకొండపల్లి, మహా:** విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు...విద్య సంగతి దేవుడెరుగు...ఎర్రటి ఎండలో మైనర్ విద్యార్థులను.... తన పొలం పనులు చేయించుకుంటున్న ఘటన ఖమ్మం జిల్లాలో చోటు చేసుకుంది...వివరాలు ఇలా ఉన్నాయి. ఖమ్మం జిల్లా, నేలకొండపల్లి మండలం లోని మంగాపురంతండాకు చెందిన ఓ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఆంధ్రప్రదేశ్ లోని పెనుగ్రంచిప్రోలు మండలం లో ఉపాధ్యాయుడు గా విధులు నిర్వహిస్తున్నాడు. తన సొంత గ్రామంలో సోమవారం వ్యవసాయం పనుల కోసం విద్యార్థులను అక్కడ నుంచి "తీసుకొచ్చి వెట్టి చాకిరి చేయించారు. తన పొలంలో ధాన్యం ఆరబెట్టే పనికి ఉపయోగించారు. ఎర్రటి ఎండలో 8 మంది స్కూల్ యూనిఫామ్ కలిగిన విద్యార్థులు ధాన్యం ఆరబెడుతుంటే స్థానికులు కళ్లు చెమ్మగిల్లాయి. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు ఇలా సొంత గ్రామంలో విద్యార్థులతో వెట్టి చాకిరి చేయించుకోవటం చర్చంశనీయంగా మారింది. చదువుకోవాలంటే ఉపాధ్యాయుల సొంత పనులు చేయాలా అనే పలువురు మండిపడుతున్నారు.

## అంబేద్కర్ విగ్రహా పరిసరాలలో పారిశుద్ధ్య పనులు

**రాజ్యాంగ నిర్మాత విగ్రహాల పారిశుద్ధ్య పనులను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ రెహనా బేగం**



**సత్తుపల్లి, మహా:** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ 135వ జన్మదిన వేడుకలను పట్టణ ప్రాంతంలో వైభవంగా నిర్వహించడానికి మున్సిపల్ చైర్మన్ రెహానా బేగం కమల్ పాషా ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు నిర్వహించారు. న్యాయ కోవిదుడికి పట్టణంలోని 15వ వార్డులో ఏర్పాటుచేసిన విగ్రహా పరిసర ప్రాంతాలను మున్సిపాలిటీ కార్మికులతో శుభ్రపరిచి అలంకరణకు సిద్ధం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రిహానా మాట్లాడుతూ మహనీయుల జయంతి వేడుకలు జరుపుకోవడం వారి త్యాగాలకు మనం ఇచ్చే గౌరవం అని అన్నారు.సత్తుపల్లి పట్టణంలో నిర్వహించే అంబేద్కర్ జయంతి వేడుకలకు అంబేద్కర్ విగ్రహాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దినట్లు మున్సిపల్ కమిషనర్ రిహానా కమల్ పాషా తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, స్థానిక వార్డు కౌన్సిలర్ దూదిపాల రాంబాబు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కాంతారావు, రాజు పాల్గొన్నారు.

మహా పత్రిక
WWW.MAHAADAILY.COM | సినిమా వార్తలు | MOVIE NEWS | మంగళవారం, హైదరాబాద్ | 14-04-2026
ANN తెలుగు



# 'అలా అయితేనే ఒప్పుకుంటా'

## అనన్య నాగళ్ల

అనన్య నాగళ్ల హీరోయిన్‌గా వస్తోన్న మూవీ "లీసా". సినిమాకు జవహర్ లాల్ రాజు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని వెంకట్ దుగ్గిరెడ్డి (యూఎస్‌ఏ), రామకృష్ణ ఐలా (యూఎస్‌ఏ) నిర్మిస్తున్నారు.  ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. తాజాగా ఈ సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ హైదరాబాద్‌లో లాంఛ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

హీరోయిన్ అనన్య నాగళ్ల మాట్లాడుతూ..' నేను ఏ మూవీ స్క్రిప్ట్ విన్నా.. అందులో చేయడానికి కొత్తగా ఏముంటుంది అనేది చూసుకుంటా.  డిఫరెంట్‌గా ఉంటేనే ఆ మూవీని ఒప్పుకుంటా. లీసా కథ విన్నప్పుడు ఇలాంటి రోల్ నేను ఎప్పుడూ చేయలేదనిపించింది. ఈ సినిమాలో అవకాశం దక్కడం సంతోషంగా ఉంది. లీసా మూవీలో నటిస్తున్నప్పుడు నటిగా కొత్తదనాన్ని ఫీలయ్యా. హీరోయిన్స్‌గా మాకు అరుదుగా ఇలాంటి చిత్రాలు దక్కుతుంటాయి. డైరెక్టర్ జవహర్ లాల్ రాజు  ఉదయం 7 గంటల నుంచి తెల్లవారి 3 గంటల వరకు కూడా షూట్ చేసేవారు. సతీష్ రెడ్డి బ్యూటిఫుల్ విజువల్స్ అందించారు. లీసా నా కెరీర్ లో గుర్తుండిపోయే సినిమా అవుతుందనే నమ్మకం ఉంది' అని  అన్నారు.

దర్శకుడు జవహర్ లాల్ రాజు మాట్లాడుతూ..' లీసా సినిమాలో ఒక డిఫరెంట్ స్క్రీన్ ప్లే, మేకింగ్ చూస్తారు.ఈ సినిమా చూస్తూ షాక్ అవుతారు. ఈ సినిమాకు సతీష్ రెడ్డి అన్న బ్యాక్ బోన్‌లా నిలిచారు. మా ప్రొడ్యూసర్స్‌కు సినిమా మేకింగ్ మీద మంచి ప్యాషన్ ఉంది. అనన్య ఫర్మామెన్స్ మీ అందరినీ కట్టిపడేస్తుంది. ఈ సినిమా మేకింగ్ క్రమంలో నాకు సపోర్ట్‌గా నిలిచిన అందరికీ థ్యాంక్స్' అని అన్నారు. కాగా.. ఈ చిత్రంలో వెంకట్ దుగ్గిరెడ్డి, దశరథ్, కిషోర్ దాస్, రవిరెడ్డి , సత్యశ్రీ, మాసం రత్నాకర్ రెడ్డి, హను శ్రీ, గీత, భాను కీలక పాత్రల్లో నటించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034.   RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com

## రోడ్డు భద్రత ప్రమాణాలు పాటిస్తూ ప్రయాణం చేయండి

- ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు...
- ట్రాఫిక్ డిసిపి అవినాష్ కుమార్..




**రాజేంద్రనగర్ మహా ;** శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బేగం ఫంక్షన్ హాల్ లో సోమవారం ట్రాఫిక్ సిఐ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో హైదరాబాద్ ట్రాఫిక్ డిసిపి అవినాష్ కుమార్, శంషాబాద్ డిసిపి రాజేష్, ట్రాఫిక్ ఏసిపి నాగభూషణం గ్రామ సభల్లో రోడ్డు భద్రత ట్రాఫిక్ అవగాహన అర్రైవ్ అలైవ్ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. 13 ఏప్రిల్ నుండి 18 వరకు రోడ్డు భద్రత ట్రాఫిక్ అవగాహన అర్రైవ్ అలైవ్ కార్యక్రమాలు జరుగునున్నయన్నారు. రోడ్డు భద్రత పై ప్రతి ఒక్కరికి అవగాహన ఉండాలి, రోడ్డు భద్రత ప్రమాణాలు పాటిస్తూ ప్రయాణం చేయాలన్నారు.ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని వాహనదారులకు హెచ్చరించారు.రాష్ట్రవ్యాప్తంగా రోడ్డు భద్రత ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తున్నాము.రోడ్డు భద్రత ట్రాఫిక్ నియమావళి ప్రతి ఒక్కరు పాటిస్తూ ట్రాఫిక్ పోలీసులకు సహకరించాలని కోరారు.ఈ గ్రామ సభలో నిర్ణయించిన ప్రమాణాల ప్రకారం రోడ్ సేఫ్టీ కమిటీని సభ్యులు, వాహన దారులు ప్రజలు, అందరూ కలిసి రోడ్ భద్రతపై ప్రమాణం చేశారు.ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది స్థానిక ప్రజలు, విద్యార్థులు, రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు. ప్రజల్లో రహదారి భద్రతపై అవగాహన పెంపొందించడమే మా ముఖ్య ఉద్దేశంఅన్నారు.

## రికార్డు స్థాయి విద్యుత్ డిమాండ్

- హైదరాబాద్‌లో భగ్గుమంటున్న విద్యుత్ వినియోగం
- 4381 మెగావాట్లకు చేరిన విద్యుత్ డిమాండ్
- రికార్డులు తిరగరాస్తున్న నగర విద్యుత్ వినియోగం

**హైదరాబాద్, మహా:** హైదరాబాద్ మహానగరాన్ని భానుడి ప్రతాపం ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. వేసవి తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో నగరవాసులు చల్లదనం కోసం ఏసీలు, కూలర్లపై భారీగా ఆధారపడుతున్నారు. దీని ప్రభావం నగర విద్యుత్ వినియోగంపై స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రారంభంలోనే విద్యుత్ డిమాండ్ సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (202627)లో జీహెచ్ఎంసీ పరిధిలో సోమవారం (ఏప్రిల్ 13) నాడు అత్యధిక విద్యుత్తు డిమాండ్ నమోదైంది. సరిగ్గా మధ్యాహ్నం 4:01 గంటలకు విద్యుత్తు వినియోగం 4,381 మెగావాట్లకు చేరుకుంది. ఈ వేసవి సీజన్‌లో ఇప్పటివరకు ఇదే గరిష్ట స్థాయి అని అధికారులు వెల్లడించారు. గ్రేటర్ హైదరాబాద్ చరిత్రను పరిశీలిస్తే, ఇప్పటివరకు నమోదైన ఆల్ టైమ్ రికార్డు విద్యుత్ డిమాండ్ 4,421 మెగావాట్లు. ఈ రికార్డు గత మార్చి 3వ తేదీన నమోదైంది. ప్రస్తుత ట్రెండ్‌ను బట్టి చూస్తే, రాబోయే రోజుల్లో ఎండలు మరింత ముదిరితే ఈ ఆల్ టైమ్ రికార్డు కూడా కనుమరుగయ్యే అవకాశాలు మెండుగా ఉన్నాయని వాతావరణ మరియు విద్యుత్ విశ్లేషకులు భావిస్తున్నారు.నగరంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతల కారణంగా గృహ వినియోగదారులు మరియు వాణిజ్య సముదాయాల్లో ఎయిర్ కండిషనర్లు, కూలర్ల వాడకం విపరీతంగా పెరిగింది. మధ్యాహ్న సమయాల్లో ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో విద్యుత్ గ్రిడ్‌పై ఒత్తిడి పెరుగుతోంది.

అయినప్పటికీ, టీజీఎస్పీడీసీఎల్ గ్రిడ్ స్థిరత్వాన్ని కాపాడుతూ వినియోగదారులకు ఎటువంటి సాంకేతిక ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్తును నిరంతరాయంగా సరఫరా చేస్తోంది. పెరిగిన డిమాండ్‌కు అనుగుణంగా సబ్‌స్టేషన్ల సామర్థ్యాన్ని పర్యవేక్షించడం, లోడ్ సర్దుబాటు చేయడం వంటి చర్యలను సంస్థ యుద్ధ ప్రాతిపదికన చేపడుతోంది. భవిష్యత్తులో విద్యుత్ డిమాండ్ 4,500 మెగావాట్లు దాటినా, ఆ అవసరాలను తీర్చడానికి అవసరమైన మౌలిక సదుపాయాలు మరియు విద్యుత్ లభ్యత తమ వద్ద సిద్ధంగా ఉన్నాయని సంస్థ ధీమా వ్యక్తం చేసింది.రాష్ట్రవ్యాప్త పరిస్థితులను గమనిస్తే ఒక ఆసక్తికరమైన అంశం వెలుగులోకి వచ్చింది. ఈ నెల 12వ తేదీన రాష్ట్రం మొత్తం మీద నమోదైన విద్యుత్ డిమాండ్, అంతకుముందు రెండు రోజుల కంటే తక్కువగా ఉండటం గమనార్హం. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాల్లో అక్కడక్కడా కురిసిన జల్లులు లేదా మేఘావృతమైన వాతావరణం వల్ల వినియోగం స్వల్పంగా తగ్గి ఉండవచ్చని అంచనా. కానీ, హైదరాబాద్ మహానగరంలో మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కాంక్రీట్ వనాల కారణంగా నగరంలో వేడి ఎక్కువగా ఉండటం, జనాభా సాంద్రత మరియు వాణిజ్య కార్యకలాపాలు ఎక్కువగా ఉండటంతో విద్యుత్ వినియోగం నిలకడగా పెరుగుతూనే ఉంది. వినియోగదారులకు మెరుగైన సేవలందించడమే లక్ష్యంగా టీజీఎస్పీడీసీఎల్ తన సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ, అత్యవసర మరమ్మతుల కోసం ప్రత్యేక బృందాలను కూడా అందుబాటులో ఉంచింది.

## వ్యవసాయ విద్యుత్ సబ్సిడీకి భారీ నిధులు

- డిస్కమ్‌లకు రూ.14వేల కోట్ల మంజూరు
- రైతులకు అండగా విద్యుత్ టారిఫ్ సబ్సిడీ

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలోని వ్యవసాయ రంగం అభివృద్ధికి, అన్నదాతల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యతనిస్తున్న తెలంగాణ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. సాగు ,దాని అనుబంధ రంగాలకు అందిస్తున్న రాయితీ విద్యుత్తు సరఫరాలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూసేందుకు భారీ ఎత్తున నిధులను కేటాయించింది. ఈ క్రమంలో, 202627 ఆర్థిక సంవత్సరానికి గాను మొత్తం రూ.14,000,00,01,000 (పద్నాలుగు వేల కోట్ల ఒక వెయ్యి రూపాయలు) మంజూరు చేస్తూ ఇంధన శాఖ సోమవారం అధికారిక ఉత్తర్వులు వెలువరించింది. ఈ నిధులను రాష్ట్రంలోని రెండు ప్రధాన విద్యుత్ పంపిణీ సంస్థలైన టీజీఎస్పీడీసీఎల్ (దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ) , టీజీఎన్పీడీసీఎల్ (ఉత్తర ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ) కు కేటాయించారు. మంజూరైన ఈ భారీ మొత్తాన్ని ఏప్రిల్ 2026 నుండి ప్రారంభమయ్యే ప్రతి నెలా సమాన వాయిదాల్లో పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీని ప్రకారం, ప్రతి నెలా రూ. 1,166.67 కోట్ల చొప్పున డిస్కమ్‌లు తమ అవసరాల కోసం క్లెయిమ్ చేసుకోవడానికి ప్రభుత్వం మార్గం సుగమం చేసింది. ఈ నిధుల విడుదల వల్ల క్షేత్రస్థాయిలో విద్యుత్ సరఫరా వ్యవస్థ మరింత పటిష్టం కావడంతో పాటు ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ, లైన్ల మరమ్మతులు వంటి అంశాల్లో జాప్యం లేకుండా చూడవచ్చని అధికారులు భావిస్తున్నారు.సాంకేతికంగా ఈ నిధులను 'అసిస్టెన్స్ టు ట్రాన్స్‌మిషన్ కార్పొరేషన్ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్ ఫర్ అగ్రికల్చర్ అండ్ అలైడ్ సబ్సిడీ' పథకం కింద టీజీ ట్రాన్స్‌కోకు కేటాయించడం జరిగింది. ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాల ప్రకారం, ఈ మొత్తం నిధులను హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రీ శాఖలో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ప్రత్యేకంగా 'టీజీ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీస్ పూల్ అకౌంట్' లో ఈ సొమ్మును జమ చేయడం ద్వారా, డిస్కమ్‌ల ఆర్థిక అవసరాలను ఎప్పటికప్పుడు తీర్చేందుకు వీలు కలుగుతుంది. సాధారణంగా వ్యవసాయానికి ఉచిత విద్యుత్తును అందించడం వల్ల విద్యుత్ పంపిణీ సంస్థలపై పడే ఆర్థిక భారాన్ని ప్రభుత్వం ఈ సబ్సిడీ నిధుల రూపంలో భర్తీ చేస్తూ వస్తోంది. ఈ సకాలంలో నిధుల విడుదల వల్ల విద్యుత్ ఉత్పత్తి సంస్థలకు (Gencos) చెల్లించాల్సిన బకాయిలను సకాలంలో తీర్చడానికి, అలాగే విద్యుత్ కొనుగోలు ఒప్పందాలను నిలబెట్టుకోవడానికి డిస్కమ్‌లకు ఎంతో సహాయకారిగా ఉంటుంది.ప్రస్తుత వేసవి కాలంలో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రికార్డు స్థాయికి చేరుతున్న నేపథ్యంలో, ప్రభుత్వం ముందుచూపుతో ఈ నిధులను కేటాయించడం గమనార్హం. కేవలం సాగు రంగమే కాకుండా, వ్యవసాయ అనుబంధ రంగాలకు కూడా ఈ టారిఫ్ సబ్సిడీ వర్తిస్తుండటంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఇది పెద్ద ఊతమిస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో విద్యుత్ శాఖాధికారులు నిధుల క్లెయిమ్ ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఏప్రిల్ మాసానికి సంబంధించిన మొదటి విడత నిధులు త్వరలోనే పూల్ అకౌంట్‌లో జమ కానున్నాయి. రైతులకు నిరంతరాయంగా, నాణ్యమైన విద్యుత్తును అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చేస్తున్న ఈ ప్రయత్నం క్షేత్రస్థాయిలో సాగు విస్తీర్ణం పెరగడానికి మరియు దిగుబడులు ఆశాజనకంగా ఉండటానికి దోహదపడనుంది. మొత్తానికి, భారీ బడ్జెట్ కేటాయింపులతో ఇంధన రంగంలో స్థిరత్వాన్ని తీసుకురావడానికి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం హర్షణీయం.

## రాష్ట్రాన్ని దేశం గుర్తించేల అభివృద్ధి చేసింది కేసీఆర్

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి
- కేసీఆర్ కేటీఆర్ ను విమర్శించే హక్కు స్థానిక ఎంపీ ఎమ్మెల్యేకు లేదు
- ఫార్మాసిటీ అవినీతిపై నేను చర్చకు సిద్ధం నువ్వు వస్తావా.?
- మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి ఎంపీ చామాల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి చేసింది ఏమి లేదని కిషన్ రెడ్డి దుయ్యబట్టారు. అనంతరం ఇబ్రహీంపట్నం నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంచిరెడ్డి కిషన్ రెడ్డి మాట్లాడుతూ... స్థానిక భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మీరు ఇబ్రహీంపట్నం నియోజకవర్గానికి ఎన్ని సార్లు వచ్చారు, ఎన్ని నిధులు తెచ్చారో చెప్తారా అని ఘాటుగా ప్రశ్నించారు. ఫార్మాసిటీ భూములలో అవినీతి జరిగిందన్న ఎమ్మెల్యే తీరు పట్ల, ఈ శుక్రవారం మేడిపల్లి గ్రామంలో చర్చకు నేను సిద్ధం, నువ్వు వస్తావా అంటూ ఎమ్మెల్యేకు, మంచిరెడ్డి సవాలు విసిరారు. హైదరాబాద్ ను మోడల్ హైదరాబాద్ గా అభివృద్ధి చేసింది కేటీఆర్ అని, కానీ రాష్ట్రాన్ని హైడ్రా పేరుతో సర్వ నాశనం చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వం అని విమర్శించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో భూ కబ్జాలు చేసింది ఎవరనేది త్వరలో తేలుతుందని మంచి రెడ్డి అన్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో మూడు సార్లు నా చేతుల్లో చిత్తుగా ఓడినా మల్ రెడ్డి రంగారెడ్డి నా పై మాట్లాడే అర్హత నీకు లేదని అన్నారు. నియోజకవర్గంలో మొన్న సర్పంచులు, నేడు కౌన్సిలర్లు, చైర్మన్ బిఆర్ఎస్ కు ప్రజలు అధిక సంఖ్యలో గెలిపించాలని అని గుర్తు చేశారు. నియోజకవర్గంలో నీ పాలన నీ ప్రభుత్వ పాలన నచ్చకనే ప్రజలు ఛీ కొడుతున్నారు. మంత్రి పదవిపై కాదు ఇబ్రహీంపట్నం నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. స్థానిక ఎమ్మెల్యే రంగారెడ్డి నియోజకవర్గంలో చేసిన అవినీతిని, త్వరలో ప్రజల ముందు పెడతానని మాజీ ఎమ్మెల్యే కిషన్ తెలిపారు.




## వేళకు బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు..!

### ప్రయాణికుల భద్రతను విస్మరిస్తున్న ఆర్టీసీ అధికారులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** ప్రయాణికుల భద్రతే ఆర్టీసీ ముఖ్య లక్ష్యమని చెబుతున్న, అది మాత్రం ప్రయాణికులను చేరవేసే విషయంలో ఎక్కడ కనిపించడం లేదని పలువురు ప్రయాణికులు తమ ఆవేదన వెలిబుచ్చారు. సోమవారం యాచారం నుంచి కందుకూరు వెళ్లే ప్రయాణికులు బస్సుల కోసం ఇబ్బందులు పడ్డారు. యాచారం నుంచి కందుకూరు వెళ్లే ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల రాకపై తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిన్న వచ్చిన బస్సు ఇవాళ వస్తుందో రాదో తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. బస్సులు సమయానికి రాకపోవడంతో పాటు, వారంలో కొన్ని రోజులు అసలు రావడం లేదని వారు వాపోతున్నారు. దీనివల్ల ప్రైవేటు వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోందని, అక్కడ భద్రత లేకపోవడంతో పాటు అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు ఆవేదన చెందారు. ప్రయాణానికి ఆర్టీసీ అత్యంత ప్రాధాన్యత నిస్తోందని చెబుతున్న ఇందుకు ఆర్టీసీ భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు. బస్సులు లేకపోవడంతో ప్రయాణికుల సమస్య తీరడం లేదన్నారు. ప్రయాణికుల సమస్యలు వాస్తవ పరిస్థితుల్ని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తే వారి స్పందన కరువైంది. అధికారులు ఇకనైనా స్పందించి క్రమం తప్పకుండా వేళకు బస్సుల నడపాలని కోరారు.

## లక్ష్మీ నరసింహ స్వామి సేవలో ఎమ్మెల్యే రంగారెడ్డి

- పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు
- ఎమ్మెల్యే రంగారెడ్డిని సన్మానించిన ఆలయ కమిటీ సభ్యులు



**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి మహా:** చీర్యాల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలకు హాజరైన ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, స్వామివారి సేవలో పాల్గొన్నారు. సోమవారం మేడ్చెల్ నియోజకవర్గంలోని కీసర మండలం శ్రీశ్రీశ్రీ చీర్యాల లక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం అష్టాదశ వార్షిక బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న, ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు రెడ్డి రంగారెడ్డి, ఆలయంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించిన ఆయన అనంతరం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రంగారెడ్డిని శాలువాతో సన్మానించి, స్వామి వారి జ్ఞాపికను బహుకరించి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రంగారెడ్డి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రజలు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో సుభిక్షంగా వర్ధిల్లాలని స్వామివారిని కోరినట్లు తెలిపారు.

## పోలీసులకు ఏపీ సర్కారు తీపి కబురు

- బర్త్ డే, మ్యారేజ్ డే నాడు సెలవు
- పోలీసు సంక్షేమానికి పెద్దపీట.. సర్కారు నిర్ణయం
- కానిస్టేబుల్ నుంచి అధికారి వరకు ఊరట

**విజయవాడ, మహా:** అహోరాత్రులు విధుల్లో ఉంటూ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం తమ వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసే పోలీసు సిబ్బందికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ,పోలీస్ శాఖ ఒక గొప్ప శుభవార్తను అందించాయి. రాష్ట్రవ్యాప్తంగా విధుల్లో ఉన్న పోలీసు సిబ్బందికి వారి పుట్టినరోజు , వివాహ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక సెలవు మంజూరు చేస్తూ ఏపీ పోలీస్ విభాగం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నిర్ణయం కేవలం క్షేత్రస్థాయిలో పని చేసే కానిస్టేబుళ్లకు మాత్రమే పరిమితం కాకుండా, విభాగంలోని అన్ని హోదాల అధికారులకు వర్తిస్తుందని డీజీపీ స్పష్టం చేయడం గమనార్హం. గత కొంతకాలంగా పోలీస్ అసోసియేషన్లు చేస్తున్న ఈ విన్నపాన్ని ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, తక్షణమే అమలులోకి తీసుకువచ్చింది. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది సిబ్బందికి తమ వ్యక్తిగత జీవితంలో చిరస్మరణీయంగా నిలిచే రోజులను కుటుంబంతో కలిసి ఆనందంగా గడిపే అవకాశం లభించింది. శాంతిభద్రతల పరిరక్షణలో నిరంతరం శ్రమించే పోలీసులు మానసిక ప్రశాంతతను పొందడానికి, వారిలో కొత్త ఉత్సాహాన్ని నింపడానికి ఇటువంటి చర్యలు అత్యంత ఆవశ్యకమని ఉన్నతాధికారులు భావిస్తున్నారు. ఈ ప్రత్యేక సెలవుల అమలులో ఎటువంటి జాప్యం జరగకూడదని, క్షేత్రస్థాయిలో ఉన్న యూనిట్ అధికారులు దీనిని తప్పనిసరిగా పాటించాలని డీజీపీ కఠిన ఆదేశాలు జారీ చేశారు. సిబ్బంది తమ పుట్టినరోజు లేదా పెళ్లిరోజు నాడు విధులకు హాజరు కావాల్సిన అవసరం లేదని, ఆ రోజును వారి వ్యక్తిగత సెలవుగా పరిగణించాలని సూచించారు. పోలీస్ వృత్తి అంటేనే కత్తిమీద సాము వంటిది. పండుగలు, పబ్బాలు అని తేడా లేకుండా సమాజం కోసం శ్రమించే క్రమంలో వారు తరచూ తమ కుటుంబ వేడుకలకు దూరమవుతుంటారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ఒక గొప్ప మానవీయ కోణాన్ని ప్రతిబింబిస్తోంది. కుటుంబంతో గడిపే నాణ్యమైన సమయం పోలీసుల మానసిక ఒత్తిడిని తగ్గించడమే కాకుండా, వారి ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేస్తుంది. ప్రశాంతమైన మనసుతో విధులకు హాజరయ్యే పోలీసులు ప్రజలకు మరింత మెరుగైన సేవలందించగలరని సామాజిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ ప్రధాన డిమాండ్‌ను పరిష్కరించడం పట్ల పోలీస్ అసోసియేషన్లు మరియు సిబ్బంది సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ANN తెలుగు

# మహా పత్రిక

మంగళవారం, హైదరాబాద్ | 14-04-2026

జిల్లా వార్తలు | DISTRICT NEWS

WWW.MAHAADAILY.COM



## ఇంటర్ లో మార్కులు తక్కువ వచ్చాయని మనస్థాపం

### యువకుడి అదృశ్యం



**కుషాయిగూడ, మహా :** ఇంటర్ లో మార్కులు తక్కువ వచ్చాయని మనస్తాపం చెందిన యువకుడు ఇంటి నుండి బయటకు వెళ్లి అదృశ్యమయ్యాడు. ఈ సంఘటన జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది ఎస్ హెచ్ ఓ సైదులు తెలిపిన కథనం ప్రకారం యాప్రాల్లోని జై జవాన్ కాలనీలో చల్లా సుబ్బలక్ష్మి కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తుంది. కుమారుడు చెల్లా బాలాజీ(17) ఇంటర్ చదువుతున్నాడు. ఇంటర్లో 400 మార్కుల పైగా వస్తాయని ఆశించిన బాలాజీకి 300 మార్కులే రావడంతో మనస్థాపన చెందాడు. ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి ఇంతవరకు తిరిగి రాలేదు. దీంతో అతని ఆచూకీ కోసం చుట్టుపక్కల వెతికినా బంధువుల వద్ద వెతికినా సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యులు జవహర్ నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## మున్సిపల్ వ్యర్థాలను సిమెంట్ పరిశ్రమల్లో వినియోగించాలి..

- RDF వినియోగంపై కలెక్టర్ బి.చంద్రశేఖర్ కీలక ఆదేశాలు..
- నల్గొండ, సూర్యాపేట జిల్లాల సిమెంట్ యాజమాన్యాలతో సమీక్ష..
- పర్యావరణ పరిరక్షణకు శాస్త్రీయ నిర్వహణే మార్గం..



**నల్గొండ, మహా :** పట్టణాల్లో సేకరిస్తున్న మున్సిపల్ ఘన వ్యర్థాలను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించి వాటిని ఉత్పాదక రంగంలో వినియోగించుకోవడంపై జిల్లా యంత్రాంగం దృష్టిసారించింది. ముఖ్యంగా బయోడిగ్రేడబుల్ మరియు నాన్‌బయోడిగ్రేడబుల్ వ్యర్థాల సమర్థ నిర్వహణపై జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. నల్గొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలోని సిమెంట్ ఫ్యాక్టరీల యాజమాన్యాలతో కలెక్టరేట్ లో జరిగిన ఈ సమావేశంలో మున్సిపల్ వ్యర్థాలను ఇంధనంగా మార్చే ప్రక్రియపై దిశానిర్దేశం చేశారు. మిర్యాలగూడ, చందనపల్లి డంపింగ్ యార్డులలో ఉత్పత్తి అవుతున్న ఘన వ్యర్థాల రీసైక్లింగ్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాలు మరియు కుదుర్చుకున్న అవగాహన ఒప్పందాల (MoU) ప్రకారం సిమెంట్ పరిశ్రమలు చర్యలు చేపట్టాలని సూచించారు. మున్సిపల్ వ్యర్థాలను ఆర్.డి.ఎఫ్ (Refuse Derived Fuel)గా మార్చి ఇంధనంగా వాడాలని, డంప్ యార్డుల నుండి 100 కిలోమీటర్ల పరిధిలో ఉన్న పరిశ్రమలు కనీసం 6 శాతం మేర ఈ ఆర్.డి.ఎఫ్ వినియోగించాలని స్పష్టం చేశారు. వేరు చేసిన పొడి వ్యర్థాల్లో తేమ శాతం 20 కంటే తక్కువగా ఉండి 40 మిల్లీమీటర్ల పరిమాణంలో ఉంటే వాటిని ఏ.ఎఫ్.ఆర్ (Alternate Fuel & Raw Material)గా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. మున్సిపల్ వ్యర్థాల పునర్వినియోగం కోసం ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను కూడా అన్వేషించాలని సిమెంట్ సంస్థల ప్రతినిధులను కోరారు. చందనపల్లి డంప్ యార్డ్ నుండి సేకరించిన వ్యర్థాలు మరియు ఫ్లై యాష్ నమూనాలను విశ్లేషణ కోసం పంపినట్లు వాటి కాలోరిఫిక్ విలువ ఆధారంగా భవిష్యత్తులో వినియోగంపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ అధికారులు శ్రీదేవి, సతీష్, మున్సిపల్ కమిషనర్లు మరియు మై హోమ్, జువారి, దక్కన్, అంబుజా వంటి ప్రముఖ సిమెంట్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజలందరికీ భాగస్వామ్యంతోనే కాలనీల అభివృద్ధి





- కాలనీ వాసుల సొంత నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు
- మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్

**కుషాయిగూడ, మహా :** ప్రజలందరికీ భాగస్వామ్యంతోనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ప్రగతిలో ప్రతి పనికి ప్రభుత్వంపై ఆధారపడకుండా ప్రజలందరి భాగస్వామ్యంతో సొంత నిధులతో అభివృద్ధి చెందవచ్చునని జవహర్ నగర్ మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ తెలిపారు. చంద్రపురి కాలనీలోని ముత్తుస్వామి కాలనీలో కాలనీవాసుల సహకారంతో సోమవారం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, మాజీ కార్పొరేటర్ నిహారిక గౌడ్ తో కలిపి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మాజీ కార్పొరేటర్ నిహారిక గౌడ్ రూ. 75000 ఆర్థిక సహాయం అందించడం అభినందనీయ మనీ అలాగే తమ వంతు సహాయంగా రచన స్కూల్ ప్రిన్సిపల్ శ్రీకాంత్ రెడ్డి ఆర్థిక సహకారం తోపాటు కాలనీలోని ప్రజలందరూ కొంత మొత్తం వేసుకొని ఈ మహత్కర కార్యాన్ని చేపట్టడం శుభ సూచకమన్నారు. ప్రాంతాలు అభివృద్ధి చెందినప్పుడే ఊరు అభివృద్ధి చెందుతుందని తద్వారా దేశం పురోగాభివృద్ధిలో ముందుకు పయనిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవకుడు బూడిద వెంకటేష్, మహేందర్ యాదవ్, భాస్కర్ గౌడ్, అనిల్ ముదిరాజ్, కిషోర్, కిరణ్, రవి, కర్ణాకర్, వంశీ, విజయ్ ,రాజు పటాన్, రాము, భరత్ ,రాములమ్మ, యాదలక్ష్మి, నాగమణి, శకుంతల కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు




**సదాశివపేట: మహా :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135 వ జయంతి సందర్భంగా సదాశివపేట మండల పరిధిలోని నిజాంపూర్ కాలనీ ప్రాథమిక పాఠశాలలో అంబేద్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటాన్ని పూలమాలతో అందంగా అలంకరించి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ 135 వ పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులు 135 ఆకారంలో చాక్లెట్లను అమర్చారు. విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటానికి పూలను సమర్పించి నమస్కరిస్తూ ఆయన పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు రామకృష్ణ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్య,సమానత్వం,కుల నిర్మూలన కోసంఅంబేత్కర్ ఎంతో పోరాటం చేసారని అన్నారు. దార్శనికతకు విద్య ఒక మూల స్తంభం అన్నారన్నారు. అభ్యాస ప్రాపృత, డిజిటల్ అక్షరాస్యత కార్యక్రమాల పట్ల విద్యాసంస్థలు తమ నిబద్ధతలను పునరుద్ధరించుకోవడానికి అంబేద్కర్ జయంతి ఒక అత్యంత అనువైన సందర్భం అని అన్నారు.ఈరోజు సామాజిక న్యాయం, సమానత్వం మరియు విద్య యొక్క ప్రాముఖ్యతను గుర్తు చేస్తుందని అన్నారు.అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచినారు.

## సామాజిక న్యాయం కోసం ఎరుకలు ప్రజా పోరాటాలు కొనసాగించాలి

- వలిగే ప్రభాకర్ అధ్యక్షులు
- ఆల్ ఇండియా ఎరుకల హక్కుల పోరాట సమితి



**వలిగొండ, మహా :** ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురవుతున్న ఎరుకల గిరిజన తెగ ప్రజల సామాజిక న్యాయం కోసం ప్రజా పోరాటాలు నిర్వహించాలని ఆలిండియా ఎరుకల హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు వలిగే ప్రభాకర్ అన్నారు సోమవారం వలిగొండ మండల కేంద్రంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా ముఖ్యుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎరుకల కులము తో పాటు సబండ వర్గాలు పని చేశాయని రాష్ట్రం వచ్చిన తర్వాత ఎరుకల కులమును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందని ఆయన అన్నారు ఎరుకల సంక్షేమం కోసం ప్రభుత్వం సంక్షేమ బోర్డును కార్పొరేషన్ను ఏర్పాటు చేసి ఎరుకల కులస్తులను ఆదుకోవాలని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ మానుపాటి కృష్ణ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు బొలుగుల భాగ్య అధ్యక్షతనజరిగిన సమావేశంలో నల్లగొండ జిల్లా అధ్యక్షులు వజ్జగిరి అంజయ్య భాస్కర్ కుతాడి రామ లింగమ్మ వెంకటమ్మ రజిత వెంకటయ్య యాదగిరి జంపన్న ఎల్లయ్య సంధ్య కవిత తదితరులు పాల్గొన్నారు

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

### సిర్పంగి స్వామి, సిపిఎం మండల కార్యదర్శి డిమాండ్



**వలిగొండ, మహా:** ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని సిపిఎం మండల కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు సోమవారం మండల పరిధిలో చిత్తాపురం గ్రామంలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులు పోసిన ధాన్యపు రాశులను పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని మార్కెట్లో నిలువ ఉన్న ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు ఇప్పటికే సుమారు గత 15 రోజులుగా రైతులు ధాన్యాన్ని కోసి ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించారని నిల్వ ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు ఈ కార్యక్రమంలో చిత్తాపురం శాఖ కార్యదర్శి ఏటేల్లి నరసింహ,సహాయ కార్యదర్శి కందుల మత్స్యగిరి ,నాయకులు సంగపాక బిక్షం,రుద్రపల్లి రామలింగం,గ్రామ రైతులు రామ్ రెడ్డి,మత్స్యగిరి, నరసింహ, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు

## జీవితం అమూల్యం.. నిబంధనలే రక్షణ కవచం..

### రోడ్డు భద్రతపై కలెక్టర్ బి.చంద్రశేఖర్ అవగాహన..




**నల్గొండ, మహా :** వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటిస్తూ తమ విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. ప్రజా పాలనప్రగతి ప్రణాళికలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలోని క్లాక్ టవర్ సెంటర్లో ఏర్పాటు చేసిన 'రోడ్ సేఫ్టీ అవేర్నెస్ ట్రీ' (రోడ్డు భద్రత అవగాహన వృక్షం) కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రహదారి భద్రతపై ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. మనిషి జీవితం ఎంతో విలువైనదని నిర్లక్ష్యంతో ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని సూచించారు. రహదారి ప్రమాదాలను అరికట్టడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కలెక్టర్ కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అది ప్రమాద సమయాల్లో ప్రాణరక్షణగా నిలుస్తుందని వివరించారు. హెల్మెట్ ధరించినప్పుడు ప్రమాదం జరిగినా ప్రాణాపాయం నుంచి ఎలా తప్పించుకోవచ్చో, అదే శిరస్త్రాణం లేకపోతే ఎదురయ్యే ఘోర పరిణామాలను ప్రదర్శన ద్వారా ప్రజలకు స్పష్టంగా వివరించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం వల్ల కలిగే ప్రయోజనాలను రోడ్డు సేఫ్టీ వృక్షం ద్వారా ప్రతీకగా చూపిస్తూ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రవాణా శాఖ అధికారులు మరియు పోలీసు సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, జిల్లా రవాణా అధికారిణి (డీటీఓ) లావణ్య, వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డితో పాటు మోటారు ఇన్స్పెక్టర్లు కొండయ్య, మల్లికార్జున్, భాస్కర్ రెడ్డి, ఉషశ్రీ, సోనిప్రియ, చిరంజీవి, గోపీనాథ్, నరేందర్ రెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌సీఐ అధికారిని అని నమ్మించి నిశ్చితార్థం కోటిన్నర కట్నం ఒప్పందం..

- నకిలీ గుర్తింపు కార్డులతో యువతిని మోసం..
- నిందితుడిని అరెస్ట్ చేసిన చైతన్యపురి పోలీసులు..




**నల్గొండ, మహా :** భారత ఆహార సంస్థ (FCI) లో ఉన్నత ఉద్యోగిని అని నమ్మించి పెళ్లి పేరుతో ఓ యువతిని మోసం చేసిన కిలాడీని చైతన్యపురి పోలీసులు కటకటాల వెనక్కి నెట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్గొండ జిల్లా మాడ్గులపల్లి మండలం చెరువుపల్లి గ్రామానికి చెందిన పనస మధు అనే వ్యక్తి సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో మోసాలకు తెరలేపాడు. తాను చెర్లపల్లిలోని ఎఫ్‌సీఐలో గ్రేడ్3 టెక్నికల్ మేనేజర్‌గా పనిచేస్తున్నానని అబద్ధం చెబుతూ నకిలీ గుర్తింపు కార్డులు సృష్టించాడు. ఈ క్రమంలోనే ఓ యువతితో పరిచయం పెంచుకుని ఆమెను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. బాధితురాలి నుంచి ఏకంగా రూ.2 కోట్ల వరకట్నం డిమాండ్ చేయగా చివరకు రూ.1.5 కోట్లకు ఒప్పందం కుదిరి నిశ్చితార్థం కూడా జరిగింది. వివాహం నిశ్చయమైన తర్వాత సదరు యువతిని 'ప్రీ వెడ్డింగ్ షూట్' పేరుతో తన గదికి పిలిపించుకున్న మధు ఆమెపై లేనిపోని అనుమానాలు వ్యక్తం చేస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేయడం మొదలుపెట్టాడు. అతని ప్రవర్తనపై అనుమానం వచ్చిన బాధితురాలు రహస్యంగా విచారించగా అతను ఎఫ్‌సీఐ ఉద్యోగి కాదని నకిలీ గుర్తింపు కార్డులతో నాటకమాడుతున్నాడని తెలుసుకుని షాక్‌కు గురైంది. బాధితురాలి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. అతని వద్ద నుంచి రెండు నకిలీ ఐడీ కార్డులు, ఒక మొబైల్ ఫోన్, 'ఆన్ గవర్నమెంట్ డ్యూటీ' అనే స్టిక్కర్ ఉన్న కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. మ్యాట్రిమోనియల్ సైట్ల ద్వారా పరిచయమయ్యే వ్యక్తుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని పూర్తి వివరాలు తెలుసుకోకుండా సంబంధాలు కలుపుకోవద్దని ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కళ నెరవేరింది

### బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్

**బెల్లంపల్లి,మహా:** ఇందిరమ్మ రాజ్యంలో పేదల సొంతింటి కళ నెరవేరిందని,పేద ప్రజల సంక్షేమం ప్రజా ప్రభుత్వ ధ్యేయమని బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పేర్కొన్నారు.సోమవారం నాడు నెన్నల్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీకి చెందిన మిట్ట రామక్క-బుచ్చయ్య దంపతులు ఇందిరమ్మ ఇల్లు పథకం కింద ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షలతో తమ స్వగృహ నిర్మాణాన్ని పూర్తి చేసుకుని నిర్వహించిన నూతన గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గృహప్రవేశం నిర్వహించి దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం మాట్లాడుతూ, "ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తూ పేదల జీవితాల్లో మార్పు తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం అని ఇల్లు లేని ప్రతి పేద కుటుంబానికి సొంతఇల్లు కల్పించడం కోసం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తున్నాం" అని అన్నారు.అనంతరం నెన్నలమండల కేంద్రంలోని ఆరో వార్డులో నూతన బోర్వెల్ పనులకు భూమి పూజ చేసి కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. నెన్నల్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 59 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ పథకాల కింద రూ.59,06,844 విలువైన చెక్కులను 59 మంది లబ్ధిదారులకి ఎమ్మెల్యే పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, "కళ్యాణ లక్ష్మి - షాదీ ముబారక్ పథకాలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయుక్తంగా నిలుస్తున్నాయన్నారు. నిరుపేద అమ్మాయిల వివాహాల సమయంలో ఆర్థికభారం తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశ్యమనివెల్లడించారు.అర్హులైన ప్రతి ఒక్కరు ఈ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలి.పేదల అభ్యున్నతికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుంది" అని అన్నారు. నెన్నల గ్రామపంచాయతీలో మాజీ సర్పంచ్ తోట సుజాత శ్రీనివాస్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డిసిసి ఉపాధ్యక్షుడు మమ్మల్ని హరీష్ గౌడ్ తో పాటు ఎమ్మార్వో , సంబంధిత అధికారులు వివిధ గ్రామ పంచాయతీ సర్పంచులు, ఉప సర్పంచులు, తాజా మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## సురక్షిత ప్రయాణం.. ప్రతి ఒక్కరి బాధ్యత..

### 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో రోడ్డు భద్రతపై ప్రచార రథాన్ని ఆవిష్కరించిన కలెక్టర్ బి.చంద్రశేఖర్..




**నల్గొండ, మహా :** రహదారి నిబంధనలు పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ హితవు పలికారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ప్రజా పాలనప్రగతి ప్రణాళిక' 99 రోజుల కార్యాచరణలో భాగంగా.. రవాణా శాఖ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ప్రారంభమైన 'అరైవ్ అలైవ్' అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో రోడ్డు భద్రత పోస్టర్లు, ప్రచార రథాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోవడం ఆ కుటుంబానికి తీరని లోటని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి సురక్షితంగా ప్రయాణించాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణించే వారు సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని కలెక్టర్ స్పష్టం చేశారు. చిన్నతనం నుంచే పిల్లలకు హెల్మెట్ ధరించే అలవాటు చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. వాహనానికి సంబంధించిన పత్రాలను కలిగి ఉండటంతో పాటు వాహనం కండిషన్‌లో ఉండేలా చూసుకోవడం యజమానుల బాధ్యత అని పేర్కొన్నారు. జిల్లాలోని ఐదు జాతీయ రహదారులు, రెండు రాష్ట్ర రహదారులపై తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను (బ్లాక్ స్పాట్స్) గుర్తించి, అక్కడ జీబ్రా క్రాసింగ్‌లు, స్పీడ్ బ్రేకర్లు, వార్నింగ్ లైట్లు ఏర్పాటు చేసేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. గ్రామాలు, మున్సిపాలిటీల్లో ఇప్పటికే రోడ్డు భద్రతా కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాల విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు విద్యాశాఖతో కలిసి ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్, వైద్య, పోలీస్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని వివరించారు. ఈ నెల 18వ తేదీ వరకు జరిగే ఈ వారోత్సవాల ద్వారా జిల్లాలో ప్రమాదాల సంఖ్య తగ్గుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం హాజరైన వారందరితో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రమేష్, రవాణా శాఖ డిప్యూటీ కమిషనర్ వాణి, డీటీఓ లావణ్య, వన్ టౌన్ సిఐ రాజశేఖర్ రెడ్డి, ఆర్టీఏ మెంబర్ ఆదిరెడ్డి, మోటార్ ఇన్‌స్పెక్టర్లు కొండయ్య, భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి... సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలి




### మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల, మహా :** రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలి...సురక్షితంగా గమ్యానికి చేరుకోవాలని మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం హాజీపూర్ మండలం రాపల్లి గ్రామంలో పోలీసులు అరవై అలైవ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిసిపి ఏ భాస్కర్, మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, ఏ సి పి ప్రకాష్, జిల్లా రవాణా అధికారి, హాజీపూర్ మండల తహసిల్దార్ పుష్పలత లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కలెక్టర్ లు మాట్లాడుతూ ప్రతి వాహనదారుడు రహదారి భద్రత నిబంధనలను పాటించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రత సూచికలను కచ్చితంగా పాటించాలని వివరించారు.వాహనదారుడు అశ్రద్ధ వహిస్తే రోడ్డు ప్రమాదం జరిగి ఆ కుటుంబం పడుతుందని చెప్పారు. వివిధ గ్రామీణ ప్రాంతాలలో రోడ్లపై కేజ్ వీల్స్ ట్రాక్టర్లు నడపకూడదని అన్నారు. ఇలా నిబంధనలు ఉల్లంఘించి రహదారులకు దెబ్బతినేలా వాహనాలు నడిపినట్లైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రతి వాహనానికి సదరు యజమాని ఆయా ధ్రువపత్రాలు కలిగి ఉండడమే కాకుండా, వాహనం నడిపే క్రమంలో మద్యం సేవించి, మొబైల్ వినియోగిస్తూ వాహనాలు నడపరాదని హెచ్చరించారు. పోలీసుల తనిఖీలలో మద్యం సేవించి వాహనం నడుపుతూ దొరికినట్లైతే సంబంధిత వాహనదారుడి లైసెన్స్ సస్పెండ్ చేయడంతో పాటు కేసు నమోదు చేస్తామని తెలిపారు.ఒకవేళ నడిపినట్లయితే వారి తల్లితండ్రులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జాతీయ రహదారులపై పరిమిత వేగాన్ని పాటించాలని, రవాణా వాహనాలు పరిమిత లోడ్ రవాణా చేయాలని తెలిపారు. పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకున్నప్పటికీ ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వామ్యలై వాహనాలను నిబంధనలకు లోబడి జాగ్రత్తగా నడపాలని తెలిపారు. అతివేగం చాలా ప్రమాదమని, అనుభవానికి ప్రమాదానికి సంబంధం లేదని, వేగం పరిమితిలో ఉండి నిబంధనలు పాటించినట్లయితే గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవచ్చని తెలిపారు.ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చెప్పారు. కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ ధరించాలని తెలిపారు. పరిమితికి మించి వాహనాలు నడపరాదని అన్నారు. గ్రామ సభలలో రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించాలని వాడు సూచించారు. అనంతరం ఆటో డ్రైవర్లు, లారీ డ్రైవర్లకు కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఆర్టిజన్ల గోస పట్టదా?

**ముఖ్యమంత్రికి సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం బహిరంగ లేఖ..**
**న్యాయమైన డిమాండ్ల కోసం ఐదు రోజులుగా కొనసాగుతున్న సమ్మె**

**నల్గొండ, మహా :** రాష్ట్రంలోని విద్యుత్ సంస్థల్లో దశాబ్దాలుగా వెలుగులు నింపుతున్న ఆర్టిజన్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. తమ న్యాయమైన హక్కుల సాధన కోసం గత ఐదు రోజులుగా (ఏప్రిల్ 08 నుంచి) నిరవధిక సమ్మె బాట పట్టిన కార్మికులకు ఆయన పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రికి సోమవారం ఒక బహిరంగ లేఖ రాస్తూ.. 20 వేల కుటుంబాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తక్షణమే చర్చలు జరపాలని కోరారు. గత ప్రభుత్వం 2017లో కార్మికులను రెగ్యులర్ చేస్తామని నమ్మబలికి తీరా సమయం వచ్చేసరికి పదోన్నతులు, సెలవులు ఇవ్వకుండా వంచించిందని ఆయన విమర్శించారు. సంస్థలోని సాధారణ ఉద్యోగులకు వర్తించే 'APSEB' నిబంధనలను కాదని ఆర్టిజన్ల కోసం ప్రత్యేకంగా 2020లో నిరంకుశంగా కొత్త సర్వీసు రూల్స్ తేవడం అన్యాయమని పేర్కొన్నారు. కనీసం త్రాగునీరు, వెలుతురు వంటి కనీస సదుపాయాలు లేని సబ్‌స్టేషన్లలో సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ప్రాణాలకు తెగించి పనిచేస్తున్న కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమని లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కార్మికుల ప్రధాన డిమాండ్లను లేఖలో ప్రస్తావించారు. విద్యార్హత కలిగిన ప్రతి ఆర్టిజన్ కార్మికుడిని జూనియర్ లైన్మెన్, జూనియర్ అసిస్టెంట్ లేదా సబ్ ఇంజనీర్లుగా కన్వర్షన్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్‌పీడీసీఎల్ పరిధిలోని అన్‌మ్యాన్డ్ వర్కర్లను, 2016 నుంచి చిన్నపాటి సాంకేతిక కారణాలతో పెండింగ్‌లో ఉన్న కార్మికులను తక్షణమే సంస్థలో విలీనం చేయాలని కోరారు. బిల్ రీడర్లు, కలెక్టర్లు, హమాలీలకు కనీస వేతన చట్టాన్ని అమలు చేయడంతో పాటు, అందరికీ వర్తించేలా 'పీఆర్సీ2026'ను ప్రకటించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సమ్మె సుదీర్ఘంగా కొనసాగితే రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ సరఫరాకు ఆటంకం ఏర్పడి ప్రజలు ఇబ్బంది పడే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. పరిస్థితి మరింత జటిలం కాకముందే ముఖ్యమంత్రి స్వయంగా జోక్యం చేసుకుని కార్మిక సంఘాలతో చర్చలు జరిపి వారి న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.




### కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడిగా

## కంకల కిష్టయ్య రాజీనామా

### కంకల కిష్టయ్య సీనియర్ నాయకులు

**వలిగొండ, మహా :** కాంగ్రెస్ పార్టీకి గత పది సంవత్సరాల నుండి సేవలందిస్తూ వలిగొండ పట్టణ అధ్యక్షుడిగా పార్టీని బలోపేతం చేస్తూ వ్యక్తిగత కారణాల వలన పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కంకల కిష్టయ్య. సోమవారం మహా న్యూస్ ప్రతినిధితో తెలిపారు